
సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 2-8-2024 15/-









# GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 31 హైదరాబాద్
శుక్రవారం 2 ఆగస్టు 2024 రూ.15-00
26 ముహర్రమ్ 1446 హిజ్రీ


**తొలిగీతు**

**మీ సంతానాన్ని సత్కరించండి. వారిని మంచీ మర్యాదలతో తీర్చిదిద్దండి.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





**అతిక్రమించిన హద్దులు - ముడిపడని జీవితాలు**

## లోపల...


| | |
|---|---|
| బంగ్లాదేశ్ ...... | 04 |
| బడ్జెట్ 2024 ...... | 05 |
| క్రీడాధన శ్రేష్ఠుడు – 40 ...... | 08 |
| బరువుల్ని ఎత్తుకోండి! భారంగా మారకండి!! – 3 ...... | 12 |
| ఆహ్! గురువర్యులు అబ్దుర్రహ్మాన్ గారు ...... | 14 |
| ద్వేషాన్ని వదిలేద్దాం! ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| ఎలాంటి వైరుధ్యాలులేని గ్రంథం...ఖుర్‌ఆన్ ...... | 20 |
| ప్రేమను పంచిపెట్టండి! ...... | 26 |
| ప్రశంస – పొగడ్త ...... | 28 |
| ఒక విశ్వాసి మనస్తత్వం ...... | 30 |
| సంక్షిప్త భారతం ...... | 32 |
| సర్వత్రా ...... | 33 |
| దైవం మెచ్చిన గుణం ...... | 34 |


**తెలంగాణకు మొండిచెయ్యి**




అంకెల గారడియే
నిర్మలమ్మ బడ్జెట్టు
లోపలంత డొల్లనే
ఇది ఖాళీ బక్కెట్టు!
ఆంధ్రా బీహారులకు
బంగారపు బిస్కట్టు
తెలంగాణ కేమిలేదు
ఎక్కడుంది లోగుట్టు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

# బంగ్లాదేశ్

**బంగ్లాదేశ్** విద్యార్థి ఆందోళనలతో కుతకుతలాడుతోంది. ఈ ఆందోళనకు ముఖ్యకారణం అక్కడి ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు. బంగ్లాదేశ్ విముక్తి పోరాటం 1971లో జరిగింది. ఆ పోరాటంలో పాల్గొన్న వారిని ముక్తిజోధాస్ అంటున్నారు. వారి పిల్లలకు, పిల్లల పిల్లలకు కూడా 30 శాతం రిజర్వేషన్లు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తు ఇప్పుడు ఈ ఆందోళనలు మొదలయ్యాయి. ఈ రిజర్వేషన్లను బంగ్లాదేశ్ అధికారపక్షానికి చెందిన వారు తమ వారికి ఉద్యోగాలు ఇప్పించేందుకు వాడుకుంటున్నారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. నిజానికి ఈ రిజర్వేషన్లపై 2018లో కూడా ఆందోళనలు జరిగాయి. అప్పట్లో షేక్ హసీనా ప్రభుత్వం ఈ రిజర్వేషన్లను రద్దు చేసింది. కాని ఈ రిజర్వేషన్లను పునరుద్ధరించాలని 2024లో హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ఇప్పుడు ఈ ఆందోళన మళ్ళీ ప్రారంభమైంది. రిజర్వేషన్ల వ్యతిరేక నిరసనలు మొదట్లో శాంతియుతంగానే ప్రారంభమైనప్పటికీ రిజర్వేషన్ల అనుకూల వర్గాల పోటీ ప్రదర్శనలు, పోలీసుల బలప్రయోగంతో హింసాత్మకంగా మారాయి. దాదాపు 115 మంది మరణించారు. దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించవలసి వచ్చింది. సుప్రీంకోర్టు రిజర్వేషన్లపై విచారణ జరిపి విద్యార్థులు వెంటనే తరగతులకు హాజరు కావాలని చెప్పింది. రిజర్వేషన్లు 7 శాతానికి మించరాదని, ముక్తిపోరాటంలో పాల్గొన్నవారి కుటుంబాలకు 5 శాతం రిజర్వేషన్లు, మైనారిటీలు ఇతరులకు రెండు శాతం మొత్తం రిజర్వేషన్లు 7 శాతం మించరాదని పేర్కొంది. ఈ ఆందోళనల కారణంగా బంగ్లాదేశ్‌లో చదువుకుంటున్న 4,500 మందికి పైగా భారత విద్యార్థులు స్వదేశానికి తిరిగి వచ్చారు. వీరితో పాటు నేపాల్ కు చెందిన 500 మంది, భూటాన్‌కు చెందిన 38 మంది విద్యార్థులు కూడా భారత్‌కు వచ్చారు.

బంగ్లాదేశ్ రిజర్వేషన్ల రద్దు ఉద్యమాన్ని కొందరు భారతదేశంలో 1990ల్లో జరిగిన ఆందోళనలతో పోల్చుతున్నారు. కాని మౌలికంగా బంగ్లాదేశ్‌లో ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వేరు, భారతదేశంలో రిజర్వేషన్లు వేరు. భారతదేశంలో రిజర్వేషన్లు సామాజిక వెనుకబాటును దూరం చేయడానికి ఉద్దేశించినవి. బంగ్లాదేశ్‌లో సామాజిక వెనుకబాటును దూరం చేసే రిజర్వేషన్లేవీ లేవు. విముక్తి పోరాటంలో పాల్గొన్న వారికి భారీగా రిజర్వేషన్లు ఇవ్వడం, ఈ రిజర్వేషన్ల సాకుతో అధికారపక్షానికి చెందిన వారు ప్రభుత్వ ఉద్యోగాలు కైవసం చేసుకోవడం ఆందోళనలకు ముఖ్యకారణం. ఇలాంటి కారణాలేవీ భారత రిజర్వేషన్లకు వర్తించవు. పైగా అక్కడ మైనారిటీలకు రిజర్వేషన్లు, ట్రాన్స్ జెండర్ రిజర్వేషన్లు ఉన్నాయి. ఈ రిజర్వేషన్ల విషయంలో అభ్యంతరాలేవీ అక్కడ వినిపించలేదు. కేవలం ముక్తిపోరాటంలో పాల్గొన్న వారి కుటుంబసభ్యులకు రిజర్వేషన్లను దశాబ్దాల పాటు దాదాపు అర్థశతాబ్దిపాటు కొనసాగించడంపైనే అభ్యంతరాలు వచ్చాయని గమనించాలి.

చైనా పర్యటన ముగించుకు రాగానే బంగ్లాదేశ్ ప్రధానికి రిజర్వేషన్ల ఆందోళనలు స్వాగతం పలికాయి. షేక్ హసీనా ఈ రిజర్వేషన్ల వ్యతిరేక నిరసనకారులను ఉద్దేశించి వ్యంగ్యంగా రజాకార్ సంతానం చేస్తున్న ఉద్యమంగా చెప్పడంతో ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. 1971 విముక్తిపోరాటంలో బంగ్లాదేశ్‌లోని ఉర్దూ మాట్లాడే వాళ్ళు పాకిస్తాన్‌కు మద్దతిచ్చారు. వారినే రజాకార్లుగా వ్యంగ్యంగా సంబోధించడం జరిగింది. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు నిజానికి విద్యార్థుల డిమాండ్ కు అనుగుణంగానే ఉంది. కాని ఈ ఆందోళనలు హసీనా ప్రభుత్వానికి వ్యతిరేక ఆందోళనలుగా మారిపోయాయి. బంగ్లాదేశ్ ప్రతిపక్షం బిఎన్పీ నాయకుడు, బ్రిటనులో ప్రవాసిగా ఉంటున్న తారికుర్రహ్మాన్ కూడా రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలో దూకాడు. మరోవైపు బంగ్లాదేశ్ లో నోబెల్ బహుమతి గ్రహీత ప్రొ. ముహమ్మద్ యూనుస్ కూడా హసీనా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. రిజర్వేషన్ ఆందోళనపై ఆయన కూడా పెదవి విప్పారు. ఇంకో వైపు బంగ్లాదేశ్ ఆర్థికమాంద్యం ఎదుర్కొంటోంది. నిరుద్యోగం పెరుగుతోంది. ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటుతోంది. ప్రజల్లో హసీనాపై వ్యతిరేకత కూడా పెరుగుతోంది.

షేక్ హసీనా సంక్షోభం నుంచి బయటపడతారా? ఉక్కుపాదంతో వ్యతిరేకతలను అణిచివేసిన గత అనుభవాల దృష్ట్యా ఈ సారి కూడా రాజకీయ వ్యతిరేకతలను కఠినంగా అణిచివేసే అవకాశాలున్నాయి. కాని ఈ లావాలోనే ఉబుకుతుంటే అది ఏదో ఒక రోజు బయటపడకతప్పదు.

అబ్దుల్ వాహెద్




**కేంద్ర ప్రభుత్వం బడ్జెట్టు ప్రవేశపెట్టింది.** ఇప్పుడు బడ్జెట్టుపై మీడియాలో చర్చ జోరుగా సాగుతోంది. హిందూస్తాన్ టైమ్ పత్రిక దీన్ని కోయలిషన్ ఎకనమిక్స్ (Coalition Economix) అని రాసింది. దినపత్రికలు చాలా వరకు బడ్జెటులోని సానుకూలాంశాలపై, అంటే మౌలికవసతుల కల్పన, విద్య, చిన్న మధ్యస్థాయి పరిశ్రమలు వగైరాలకు సంబంధించి సానుకూలాంశాల గురించి రాశాయి. కాని ఈ బడ్జెటు వెనుక రాజకీయ లక్ష్యాలను మీడియా స్పష్టం చేసింది. 'సంకీర్ణాన్ని కాపాడుకునే బడ్జెటు' అని కొందరు స్పష్టంగా చెప్పారు.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 83 నిముషాల పాటు లోక్‌సభలో మాట్లాడారు. ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రతిపక్ష సభ్యులు పార్లమెంటు నుంచి బయటకు వచ్చి చేసిన వ్యాఖ్యలు మీడియాలో ప్రసారమయ్యాయి. రాహుల్ గాంధీ ఈ బడ్జెటును "కుర్సీ బచావో బడ్జెటు" అని ఎత్తిపొడిచారు. అంటే అధికారం కాపాడుకునే బడ్జెటు అని రాహుల్ చేసిన వ్యాఖ్య మీడియాలో హెడ్‌లైన్‌గా మారింది.

ఆ తర్వాత మీడియాలో చర్చ అంతా ఇది అధికారం కాపాడుకునే బడ్జెటా లేక అభివృద్ధి ప్రధాన బడ్జెటా అనే అంశంపైనే నడిచింది. సమాజవాది నాయకుడు అఖిలేష్‌యాదవ్ ఈ బడ్జెటును తీవ్రంగా విమర్శించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ బడ్జెటును చీకటి బడ్జెటుగా అభివర్ణించింది. మీడియా చాలా వరకు బడ్జెటులోని సానుకూలాంశాలను ప్రచారం చేయడానికి ప్రయత్నించింది. బడ్జెటులో ఉద్యోగకల్పనకు ప్రాముఖ్యం ఇచ్చారని కొందరు అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల ప్రభావం బడ్జెటుపై కనిపిస్తుందని మరి కొందరు వ్యాఖ్యానించారు. అందువల్లనే ఉద్యోగకల్పన గురించి మాట్లాడుతున్నారని విశ్లేషించారు. ఇది ఎన్నికల ఫలితాల ప్రభావంతో తయారైన బడ్జెటని కొందరన్నారు.

మోడీ ప్రభుత్వం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడుపై, బీహారులో నితీష్ కుమార్‌పై ఆధారపడి నిలబడింది. చంద్రబాబు నాయుడు బడ్జెట్ తర్వాత ఎట్టకేలకు మంచి రోజులొచ్చాయని వ్యాఖ్యానించారు. నితీష్ కుమార్,

చంద్రబాబునాయుడులకు లోక్‌సభలో 28 మంది పార్లమెంటు సభ్యులున్నారు. వీళ్ళందరి మద్దతు బీజేపీకి చాలా అవసరం. అందువల్ల బీహారుకు 59 వేల కోట్ల రూపాయలు, ఆంధ్ర ప్రదేశ్‌కు 15 వేల కోట్ల రూపాయలు లభించడంలో ఆశ్చర్యమేమీ లేదని కొందరు వ్యాఖ్యానించారు. ఈ రెండు రాష్ట్రాలకు భారీ వరాలు లభించాయని రాజ్ దీప సర్దేశాయ్ వంటి జర్నలిస్టులు కూడా వ్యాఖ్యానించారు. ఈ బడ్జెటు విశ్లేషణలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, సంకీర్ణప్రభుత్వ కష్టాలు అన్నీ చర్చకు వచ్చాయి. చివరకు రాహుల్ గాంధీ చెప్పిన కుర్సీ బచావ్ బడ్జెట్ అనే వ్యాఖ్య బలం పుంజుకుంటూ కనబడింది.

ఈ బడ్జెటులో ఇంటర్న్ షిప్ గురించి ఉన్న మాటలు, అంటే దేశంలోని టాప్ 500 కంపెనీల్లో యువతకు ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పించడం గురించిన ప్రస్తావనలు నిజానికి కాంగ్రెసు మేనిఫెస్టో నుంచి కాపీ కొట్టినవిగా చాలా మంది విమర్శించారు. ఇదే కాంగ్రెసు మేనిఫెస్టోను బీజేపీ ఎన్నికల్లో విమర్శిస్తూ ముస్లిమ్‌లీగ్ మేనిఫెస్టోలా ఉందని వ్యాఖ్యానించిందన్నది కూడా మరిచిపోరాదు. రాహుల్ కన్వల్ వంటి పాత్రికేయులు ఈ బడ్జెటులో ఉద్యోగాలే ఉద్యోగాలు వస్తాయని కేరింతలు కొడితే, మరోవైపు రాజ్ దీప్ సర్దేశాయ్ మాత్రం క్షేత్రస్థాయిలో పరిస్థితి చాలా కష్టంగా ఉందన్నది గుర్తు చేశారు. ఏబీపీ న్యూస్‌లో సందీప్ చౌదరీ ఉద్యోగాల కల్పన కేవలం మాటలకే పరిమితమవుతుందా, ఆచరణలో సాధ్యమవుతుందా అని ప్రశ్నించాడు. ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం ద్వారా యువతకు నెలకు 5 వేల రూపాయలు ఇస్తామని చెప్పడాన్ని రిపబ్లిక్ టీవీలో అర్నబ్ గోస్వామి ప్రశ్నించడం కూడా గమనార్హం.

కాని ఈ బడ్జెటును కాస్త నిశితంగా పరిశీలిస్తే దేశంలో పన్నులు చెల్లించే వారికి నిరాశే మిగిల్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించిన సంక్షేమచర్యలు కేవలం కంటితుడుపుగానే కనిపిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి ముఖ్యమైన కారణం దేశంలో మధ్యతరగతి, అల్పాదాయ వర్గాల ఆదాయాల్లో పెరుగుదల లేకపోవడం, చాలా మంది ఆదాయాలు దెబ్బతినడం. దాంతో పాటు తీవ్రమైన నిరుద్యోగం. ఈ రెండింటి వల్ల గ్రామీణ ప్రాంతాల్లోను, పట్టణ ప్రాంతాల్లోను ప్రజల్లో క్రయశక్తి తగ్గిపోయింది. ఫలితంగా మార్కెటు దెబ్బతింది. ఫలితంగా అభివృద్ధి సూచికలు పడిపోయాయి. ఈ వాస్తవాన్ని ఈ సారి బడ్జెటులో కూడా గుర్తించినటట్లు కనిపించడం లేదు.

ఈ బడ్జెటులో కన్స్యూమర్ డిమాండ్ పెంచడానికి తీసుకున్న చర్యలు లేవు. బడ్జెటులో ముఖ్యంగా ద్రవ్యలోటును తగ్గించడం పైనే పూర్తి దృష్టి పెట్టారా అనిపిస్తుంది. ప్రస్తుతం ఉన్న 5.1 శాతం నుంచి 4.9 శాతానికి తగ్గించడం గురించి మాత్రమే ముఖ్యంగా ఆలోచించినట్లు ఉంది.

పన్ను చెల్లింపుదారులకు ముఖ్యంగా దిగువస్థాయిలో ఆదాయపు పన్ను కడుతున్న వారికి కొంత ఊరట ఇచ్చినట్లు కనిపించినా, వారి పెట్టుబడులపై అధిక పన్నులు పడ్డాయి. అంటే మధ్యాదాయ వర్గాలకు చేసింది ఏదీ లేదు. పన్నుల వ్యవస్థను సరళీకరిస్తున్నామని చెప్పారు కాని భారం పెంచారు. ఇప్పుడు రియల్ ఎస్టేట్‌లో లావాదేవీలు నగదు రూపంలోనే జరుగుతాయని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే షేరు మార్కెటులో చిన్నస్థాయిలో పనిచేసేవారిపై కూడా పన్నుల భారం పెరిగింది.

కాని విదేశీ కంపెనీలకు కార్పొరేటు టాక్సును 40 శాతం నుంచి 35 శాతానికి తగ్గించారు. గత పదేళ్ళుగా మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనేక వరాలు ఇస్తూ వస్తూనే ఉంది. నిశితంగా చూస్తే ఇది చిన్న చేపలను కొట్టి పెద్ద తిమింగలాలకు పెట్టడం. ఈ బడ్జెటు దేశంలో ఆర్థిక అసమానతలు దూరం చేసే బడ్జెటు కాదు. ఇంకా పెంచే బడ్జెటు. పేద, మధ్యతరగతి వర్గాలపై పన్నుల భారం పెరిగింది. ఈ బడ్జెటు పేద మధ్యతరగతి వర్గాల సాధికారతకు ఎలా తోడ్పడుతుందో అర్థం కాని విషయం.

ఇంటర్న్ షిప్పు, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి యువతలో నైపుణ్యాలు పెంచడం ఇవన్నీ ఎలా సాధిస్తారో చెప్పలేదు. విద్యా వైద్య రంగాల్లో తగిన పురోభివృద్ధి లేనప్పుడు ఇవన్నీ ఎలా సాధిస్తారు. ముఖ్యంగా కంపెనీల్లో యువతను ఇంటర్న్‌గా తీసుకోవడం, వారి స్టయిఫండ్ విషయంలో ప్రభుత్వం సహాయం చేసినా గాని, కంపెనీలు ఇంటర్న్ షిప్ కోసం తీసుకుంటాయా? ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నప్పుడే ఈ కంపెనీలు ఇంటర్న్‌ల కోసం చూస్తాయి. లేకపోతే ఇంటర్న్‌లను తీసుకుని కంపెనీలకు లాభమేమిటి?

నిశితంగా చూస్తే గద్దె కాపాడుకునే బడ్జెటులానే కనిపిస్తోంది. ఈ బడ్జెటు కనీసం కొత్తసీసాలో పాత సారా మాదిరి బడ్జెటు కూడా కాదు. ప్రస్తుతం ఉన్న స్కీములు, విధానాలనే ఆర్థికమంత్రి అటు ఇటుగా చెప్పారు. రైతులు, యువకులు, మహిళలు, మధ్యతరగతి, పేద వర్గాల వారందరికి రుచించేలా మాట్లాడారు. ఆ విధంగా ఈ వర్గాలన్నింటిని మళ్ళీ తమ వైపుకు తిప్పుకునేలా

మాట్లాడారు. కాని ఆచరణలో ఈ బడ్జెటు ఎవరికి ఏం చేసిందనేది ముఖ్యం.

ఈ బడ్జెటులో సంకీర్ణ ప్రభుత్వం మిత్రపక్షాలపై ఎంతగా ఆధారపడి ఉందో స్పష్టంగా కనిపిస్తోంది. అందువల్లనే ఆంధ్రప్రదేశ్, బీహారు రాష్ట్రాలకు ఉదారంగా కేటాయింపులు జరిగాయి. చంద్రబాబునాయుడు, నితీష్ కుమార్‌ల ఒత్తిడి పని చేసిందన్నది స్పష్టంగా అర్థమవుతోంది. ఇలా సంకీర్ణ రాజకీయాల ఒత్తిళ్ళను తట్టుకోవడం ప్రధానికి ఇదే మొదటిసారి.

చంద్రబాబునాయుడు ప్రత్యేకహెూదా కోసం పట్టుబట్టకుండా కాస్త సడలింపు ప్రదర్శించారన్నది నిజమే. కాని రాజధాని నిర్మాణానికి, అంటే అమరావతి ప్రాజెక్టు కోసం ప్రత్యేక ప్యాకేజి సాధించుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాలు, రాయలసీమ, ప్రకాశం ఉత్తరకోస్తా జిల్లాల కోసం భారీగా నిధులు కూడా పొందారు. గమనించవలసిన విషయమేమిటంటే, రాయలసీమలో కాని మిగిలిన ఈ ప్రాంతాల్లో కాని చంద్రబాబునాయుడు తెలుగుదేశం కాస్త బలహీనంగా ఉన్న ప్రాంతాలే ఇవన్నీ. ఇప్పుడు ఈ నిధులతో చంద్రబాబు నాయుడు చేపట్టే స్కీములు ఈ ప్రాంతాల్లో తెలుగుదేశం బలం పుంజుకునే అవకాశాలున్నాయి.

ఇదేవిధంగా నితీష్ కుమార్ కూడా బీహారు కోసం కావలసినవి సాధించుకున్నారు. రోడ్ల నిర్మాణానికి, పట్టణ మౌలిక సదుపాయాల కోసం బీహారుకు భారీగా నిధులు కేటాయించారు. నలందా, రాజ్గిర్, గయ వంటి చారిత్రక ప్రదేశాల్లో టూరిజం అభివృద్ధి నితీష్ కుమార్ ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్రాజెక్టు. ఆ ప్రాజెక్టుకు కూడా ఇప్పుడు మార్గం సుగమమయ్యింది. అమృతసర్, ఢిల్లీ, కోల్‌కతా ఇండస్ట్రియల్ కారిడార్‌లో గయను ఇండస్ట్రియల్ నోడ్‌గా కూడా ప్రకటించారిప్పుడు.

అందుకే ఈ బడ్జెటును తృణమూల్ కాంగ్రెసు బీహార్ బడ్జెటని నిరసించింది. సగటు ప్రజలకు ఈ బడ్జెటు శూన్యహస్తమే మిగిల్చిందని రాహుల్ గాంధీ విమర్శించారు. అలాగే తమ ఎన్నికల మేనిఫెస్టో నుంచే ఇంటర్న్ షిప్, చిన్న మధ్యతరగతి పరిశ్రమల కోసం చర్యలను తీసుకున్నారని కాంగ్రెస్ చెబుతోంది.

ఈ బడ్జెటు బ్రాండ్ మోడీ కోసం ఉపయోగపడే బడ్జెటు కాదని స్పష్టంగా తెలుస్తోంది. ప్రధాని నివాసగృహాల పథకం, ముద్ర రుణాలు, ఉచిత రేషను వంటివి గత కొంతకాలంగా బీజేపీ చెప్పుకుంటున్న విషయాలే. వాటినే కాస్త అటుఇటుగా మార్చి మరలా చెప్పడం వల్ల వాస్తవస్థితి మారిపోదు. ఉచితాలు, రేవడీ కల్చర్ అంటూ గతంలో విమర్శలు సంధించిన బీజేపీ ఇప్పుడు చేస్తున్నదేమిటి అనే ప్రశ్నలు కూడా కొందరు సంధిస్తున్నారు.

క్లుప్తంగా చెప్పాలంటే ఆర్థికవ్యవస్థకు అవసరమైన దీర్ఘకాలిక దృష్టి, పథకరచన ఏదీ ఇందులో లేదు. విధానపరమైన నిష్క్రియాపరత్వం కనిపిస్తోంది. ఈ బడ్జెటు కుబేరులకు ఆహ్లాదకరమైన బడ్జెటు. పేద మధ్యతరగతి ప్రజల జీవితాలను మార్చేబడ్జెటు మాత్రం కాదు. ✤


## చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015**

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

అధ్యాయం -15

40

# వ్రీడా ధన శ్రేష్ఠుడు

ఎస్.ఎమ్. మలిక్

## మహనీయ ఉస్మాన్(ర) గొప్పదనం

మానధనం, సొగసయిన మోము, అంతే సొగసయిన స్వరూప స్వభావాలు, జ్ఞానసంపన్నత, వివేచనాసిరి, ఆకట్టుకునే అలవాట్లు, ఆరాధనా తత్పరత, దైవం పట్ల భయభక్తులు, దయార్ద్రత, దాతృత్వం, న్యాయశీలత, హక్కుల పరిరక్షణ, సర్వసమానతా దృష్టి-వీటి పేరే మహనీయ ఉస్మాన్(ర)! చివరి కొన్నేళ్లుగా ఈ దౌర్భాగ్య పరిస్థితులు ఎదురవకపోతే ఆయన ఎంతో సాధించగలిగేవారు.

సహచర మాన్యుల్లో దైవ గ్రంథ జ్ఞానంలో ఆయన్ని మించిన వారు మరెవరూ లేరు. దివ్య ఖుర్ఆన్ పారాయణం, అందులో పరిశీలన పట్ల ఆయనకు ఎప్పుడూ తనివి తీరేది కాదు. ఒక్కోసారి రాత్రంతా ఈ కార్యక్రమంలోనే గడిపేవారు. ధార్మిక పాండిత్యం, అన్వయ శాస్త్రం, సూక్ష్మ దృష్టిలో ఆయనకు ఆయనే సాటి. అమీరుల్ మూ'మినీన్ మహనీయ ఉమర్(ర) తరువాత ఆయన కన్నా దీటయిన వారు మరొకరు లేరని పండితులు తమ చరిత్ర గ్రంథాల్లో వ్రాశారు.

### మానధనుడు!

ఆయనలోని సిగ్గు బిడియాల స్పృహ ప్రవక్త(స)కు కూడా ఉండేది. ఒకసారి ప్రవక్త మహనీయులు అబూ బక్ర్, ఉమర్ ప్రభృతులతో ఒక తోటలోని బావి వద్ద కూర్చొని ఉండగా ప్రవక్త గాలి కోసం మోకాలి పైన వస్త్రం కాస్త తొలగించి ఉన్నారు. అప్పుడు ఉస్మాన్ లోనికి వచ్చే అనుమతి కోరగానే ఆయన(స) వస్త్రం సరి చేసుకున్నారు. ఇది తెలిసిన మహనీయ ఆయిషా(ర) ప్రవక్త ని అడిగారు, "మీరు మా నాన్న పట్ల బిడియ పడరు కాని ఉస్మాన్ పట్ల బిడియ పడతారు?" అని. దానికి ఆయన(స), "ఉస్మాన్ బిడియానికి దైవ దూతలు సయితం బిడియ పడతారు" అని సమాధానం ఇచ్చారు.

ప్రవక్త పట్ల గౌరవాదరణలు అంటే చేతుల్ని ముద్దాడి కళ్ళకు అద్దుకోవడం కాదు, జీవితంలో దైవ సందేశహరుల ఆదేశాల పాలన. ఈ దృక్కోణం తో మహనీయ ఉస్మాన్(ర) జీవితాన్ని అధ్యయనం చేస్తే ఆయన జీవితం పూర్తిగా ప్రవక్త సంప్రదాయాలలోనే ఇమిడి ఉన్నట్లు తెలుస్తుంది. ప్రవక్త (స) ఆయనకు సహనం వహించవలసిందని ఉపదేశించారు. ఆయన ఈ ఆదేశాన్ని ఎలా పాటించారంటే ప్రాణాన్ని పణంగా పెట్టారు కాని వైరులతో పోరుకు పూనుకోలేదు.

ఆయనకు 'జున్నూరైన్' అన్న బిరుదు ఉంది. అంటే 'రెండు జ్యోతుల'ని అర్థం. అంటే ప్రవక్త కూతుళ్లు ఇద్దరు అన్న మాట. మహనీయ మణులు రుకయ్యా, ఉమ్మె కుల్సూమ్

ఒకరి తరువాత మరొకరు ఆయన వివాహంలోకి వచ్చారు. ఓ ఉల్లేఖనం ప్రకారం, మహనీయ ఉస్మాన్(ర) తన భార్య రుకయ్యా మృతి తరువాత ఎంతో విచారంతో కూర్చొని ఉండగా చూసి ప్రవక్త(శ) అడిగారు, "ఉస్మాన్! ఏమిటి నీ పరిస్థితి?" అని. దానికి ఆయన(ర) రుకయ్యా మృతి వల్ల తనకు ప్రవక్త(శ) తో ఉన్న బంధుత్వ బంధం పోయిందన్న బెంగ వ్యక్తం చేశారు. దానికి ప్రవక్త(శ) రుకయ్యా చెల్లి కుల్సూమ్‌ని ఆయనకు ఇచ్చి పెళ్లి చేశారు.

## స్వర్గం శుభవార్త

ఆయన ఎంతగా దైవం మన్నింపు పొందిన మహనీయులంటే ఆయనకు ప్రత్యేకంగా మూడు మార్లు ప్రవక్త(శ) (స) స్వర్గ శుభ వార్త నిచ్చారు:

రూమా బావి కొని ముస్లిమ్ సముదాయం కొరకు కేటాయించి నప్పుడు, క్షామం సంభవించినప్పుడు ఆయన వేల సంఖ్యలో ఒంటెలూ గుర్రాలు వాటి పైని ఆహార ధాన్యాల మూటలు, యుద్ధ సామగ్రితోపాటు బంగారం కూడా విరాళంగా ఇచ్చారు.

మహనీయ ఉస్మాన్(ర) ఆనాటి అరబ్బుల్లో ధనవంతులయిన వారు. ధనం తోపాటు దానగుణం వల్ల 'గనీ' అని పిలువ బడేవారు, అంటే దాతృగుణం మెండుగా గలవారు అన్న మాట. వ్యాపారమే కాక వ్యవసాయ భూములూ ఎన్నో ఉండేవి. దైవ మార్గంలో ఖర్చు పెట్టడంలో ఎన్నడూ వెనకాడ లేదు. అతిథుల కొరకు ఎంతయినా ఖర్చు పెట్టేవారు, అయితే స్వయం కొరకు అతి సాధారణ అన్నస్త్రాలు వినియోగించు కునేవారు.

## అతి నిరాడంబర మనుగడ

అబ్దుల్లా బిన్ షద్దాద్ ఇలా అన్నారు, "నేను ఒకసారి అమీరుల్ మూ'మినీన్‌ని జుమా ప్రసంగం చేస్తూ ఉండగా చూశాను, ఆయన నడుముకు కట్టుకున్న వస్త్రం ఖరీదు నాలుగయిదు దిర్హములలోపునే ఉంటుంది. మహనీయ హసన్ బిన్ అలీ ప్రకారం, "అమీరుల్ మూ'మినీన్ ప్రవక్త మస్జిద్‌లో ఏమీ పరచుకోకుండా పరుండి ఉండగా చూశాను, కేవలం ఓ దుప్పటిని దిండుగా మడచి పెట్టుకునే వారు, ఆయన ఒంటిపై గులకరాళ్ళ గుర్తులు గోచరించేవి."

ఇస్లామ్ స్వీకరించి ప్రవక్త(శ) విధేయతను అవలంబించిన నాటి నుంచి దైవానికి కృతజ్ఞతగా నెలకు నలుగురు బానిసల్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మాటను ఆయన కడవరకు నిల బెట్టుకున్నారు. ఆయనకు 'సాహిబుల్ హిజ్రతైన్' అన్న బిరుదూ ఉంది. ఆయన రెండు మార్లు హిజ్రత్ చేశారు. ఒకటి, తన సతీమణి రుకయ్యా తోడుగా అబీసీనియాకు, రెండవది, మదీనాకు. సన్మార్గ గాములయిన ఖలీఫాలలో ఎవరికీ ఇటువంటి అవకాశం దొరకలేదు.

## దేశ రక్షణ సేవలు

మహనీయ ఉమర్(ర) అమరగతి నొందిన తరువాత ఖిలా ఫత్ పాలిత సరిహద్దు ప్రాంతాల్లో తిరుగుబాట్లు తలెత్తాయి. ఈరానీయుల 60 శాతం ప్రజ తిరగబడింది. ఈజిప్టు, అలెగ్జాండ్రియ, ప్రజలు రోమను చక్రవర్తి ప్రేరేపణతో తిరగ బడ్డారు. ఇలా తీవ్రమయిన గందరగోళం, సంక్షోభ పరిస్థి తులు నెలకొన్నాయి. ఈ కకావికలమయిన వాతావరణంలోనే మహనీయ ఉస్మాన్(ర) ఖిలాఫత్ పగ్గాలు చేపట్టారు. దీన్నంతా శమియింపజేయడానికి మూడేళ్ల కాలం పట్టింది.

ఈరాన్‌లో ఎల్లెడలా ప్రభుత, శాంతి పునస్థాపన జరిగింది. అక్కడి చివరి రాజు హతుడయ్యాడు. ఉత్తర పడమర ప్రాంతాల్లో తొలుత రోమనుల సైనిక శక్తిని విరగ్గొట్టడం జరిగింది. ఆ తరువాత వారి నౌకాదళ శక్తినీ అంతం చేసి సిరియా తదితర తీర ప్రాంతాలు రోమనుల బెడద లేకుండా ఎప్పటికీ ప్రశాంతమయ్యేలా చేయడం జరిగింది. ఈ సంద ర్భంగా సరికొత్త సైనిక స్థావరాలు నిర్మించబడ్డాయి. మధ్యధరా సముద్ర తీరంలో కొంగ్రొత్త జనావాసాలను స్థాపించడంతో పాటు నావికా నిర్మాణ కార్ఖానాలు ఏర్పాటు చేయబడ్డాయి.

★★★

# 3. పరిపాలనా సంస్కరణలు, సంక్షేమ పథకాలు

## రికార్డు, క్యాలెండరు

మహనీయ ఉమర్(ర) ఖిలాఫత్ కాలంలోనే మహనీయ ఉస్మాన్(ర), పరిపాలన వ్యవహారాల్లో సౌకర్యం కొరకు అన్ని వ్యవహారాలను రికార్డు చేసి పెట్టవలసిన అవసరం గురించి సలహా ఇచ్చారు. ఆ సందర్భంలోనే ఇస్లామీయ క్యాలెండర్ ప్రారంభించవలసిన అవసరాన్ని కూడా ఆయనే గుర్తు చేశారు.

విజయ పరంపర వల్ల ఆర్థిక పరిస్థితి ఎంతో బాగుపడినప్పుడు మహనీయ ఉమర్(ర) సలహా మండలి సమావేశం జరిపి విషయాన్ని వివరించారు. అప్పుడు మహనీయ ఉస్మాన్, "మన వద్ద జనుల అవసరం కొరకు తగినంత సంపద ఉంది, అలాగే అవసరార్థులు కూడా విస్తారంగా ఉన్నారు. ఎవరెవరికి అందజేశామో మరెవరికి ఇంకా సహాయం అందజేయవలసి ఉందో రికార్డు లేకపోతే పరిస్థితి, వ్యవహా

రాలు చెడిపోయే ప్రమాదం ఉంది'' అని ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదన స్వీకారం పొందినది.

అలాగే ఇస్లామీయ క్యాలెండర్, సత్యాసత్యాల వ్యత్యాసం ఏర్పరచిన హిజ్రత్ జరిగిన సంవత్సరం నుండి ప్రారంభించాలన్న ప్రస్తావన వచ్చినప్పుడు కూడా సంవత్సరం ముహర్రం నెల నుంచి మొదలు పెట్టాలని, అది పవిత్ర మాసం కావడం మాత్రమే కాక, నెలల లెక్క ప్రకారం తొలి మాసం అని సూచించారు మహనీయ ఉస్మాన్(ర). ఇలా ఇస్లామీయ క్యాలెండర్, హిజ్రత్ జరిగిన సంవత్సరం, ముహర్రం నెల నుంచి ప్రారంభించడం జరిగింది. దీన్నే హిజ్రీ శకం అని అంటారు.

## భూ సంస్కరణలు

బంజరు భూములను, సాగు చేసుకునేందుకు ఇష్టపడే వ్యవసాయదారులకు కేటాయించే విషయంలో, తొలి ఖలీఫా మహనీయ అబూ బక్ర్ సిద్దీక్(ర) ప్రవక్తశ్రీ(స) విధానాన్ని అనుసరించారు. కొందరు సహచర మాన్యులకు వారి కోరిక, భూముల ఉనికిని బట్టి ఆయా భూముల స్వామ్యాధికారాలు అందజేశారు. ఆయన తరువాత ఈ పాలిసీని మహనీయ ఉమర్(ర) తన కాలంలో మరింత విస్తృతపరిచారు. ఆయన, 'దున్నేవానికే భూమి' అనే సిద్ధాంతాన్ని అమలు పరుస్తూ బంజరు భూములను వ్యవసాయదారులకు అలాట్ చేశారు.

మహనీయ ఉస్మాన్(ర) ఖలీఫాగా నియుక్తులయిన పిదప ఆయన కూడా అలాట్మెంట్ విధానాన్ని మరింత విస్తృతం చేశారు. ముఖ్యంగా పరాజిత ప్రాంతాల సేద్య భూములను, యజమానులు వాటిని వదిలేసి పారిపోయిన సందర్భాలలో, ఇతర వ్యవసాయదారుల్లో పంచిపెట్టారు. బంజరు భూములు, రాళ్ళున్న భూముల్ని సయితం కష్టజీవుల్లో పంపిణీ చేశారు. వాటిని వారు మెట్ట పొలాలుగా మార్చి వినియోగించుకున్నారు. ఇలా భూముల పంపిణీ వల్ల ప్రజలకూ ప్రభుత్వానికీ ఎనలేని ఆదాయం లభించింది.

## పశువుల మేత మైదానాలు

ప్రభుత్వ ఒంటెలూ గుర్రాలను మేపడానికి ఇంకా సదకా రూపేణా వసూలు అయ్యే పశువుల కోసం మేత మైదానాలు అవసరమవుతాయి. ప్రవక్తశ్రీ కాలంలో మదీనాకు దక్షిణాన దాదాపు వంద మైళ్ళ దూరాన ఓ లోయను "వాదీ నకీ" అనే మైదానాన్ని ఈ అవసరానికి వాడుకునే వారు. అలాగే మహనీయ ఉమర్ కాలంలోనూ సిపాయీల ఒంటెలూ గుర్రాలు అధికం కావడంతో మరో మైదానాన్ని ప్రత్యేకించడం జరిగింది. వాటిలో ధనవంతులు కాని సామాన్యుల ఒంటెలు ఒకటీ అరా ఉంటే వాటిని సయితం మేపే అనుమతి ఉండేది.

జనావాసాలు పెరిగిన కొద్దీ పశువుల మేత మైదానాల ఆవశ్యకత కూడా పెరిగింది. మహనీయ ఉస్మాన్ మేత మైదానాలను కూడా బాగా పెంచారు. ఈ అవసరాన్ని సహచర మాన్యులు ఎవరూ కాదనలేదు.

## వేతనాలు

ప్రభుత్వ ఆదాయానికి జకాత్, సదకా(దాన ధర్మాలు), మాత్రమే కాక ఇతర విధాల రాబడులూ ఉంటాయి. కేంద్ర ధనాగారంలో నేరుగా వచ్చే ఆదాయంతోపాటు, పాలిత ప్రాంతాల నుంచి వచ్చే, అక్కడి అవసరాలకు మించిన ఆదాయం కూడా ఉంటుంది. దాని ద్వారానే ఖర్చులన్నీ చక్క బెట్టడం జరుగుతుంది. గవర్నర్ల, ఉద్యోగుల, సిపాయీల వేతనాల పంపిణీ జరుగుతుంది. అయితే జకాత్, సదకాలను వాటి కై ప్రత్యేకమయిన పద్దుల్లోనే, దాదాపు మొత్తం, అవసరార్థులను, బాటసారులను, అప్పుల్లో కూరుకుపోయిన వారిని, తదితరుల్ని ఆదుకునేందుకు ఖర్చు పెట్టడం జరుగుతుంది.

## కాబా ప్రాంగణం విస్తరణ

ప్రవక్త మహనీయుల(స) కాలంలో కాబా ప్రాంగణం ఇరుకుగానే ఉండేది, మహనీయ అబూ బక్ర్ (ర) కాలంలోనూ అలాగే ఉండనిచ్చారు, అయితే మహనీయ ఉమర్(ర) కాలంలో దాని విస్తృతి జరిగింది. మహనీయ ఉస్మాన్(ర) కాలంలో జన విస్తారం వల్ల దాన్ని మరింత విస్తృతం చేయవలసి వచ్చింది. ఆయన ప్రభుత్వ ధనాగారం రొక్కం ద్వారా కాబా చుట్టూ ఉన్న గృహాలను కొని కాబా ప్రాంగణంలో కలిపారు. దాని చుట్టూ నిలువెత్తు గోడ కూడా కట్టించారు. అదేవిధంగా ఖిలాఫత్ పరిధిలోని ప్రాంతాల్లోనూ ఆయా ప్రాంతాల ధనాగారాల ద్వారా మస్జిద్లు కట్టుకునే నిర్దేశాలు జారీ చేయబడ్డాయి.

## తొలి యుద్ధ నౌక

మహనీయ ఉస్మాన్(ర) ఖిలాఫత్ కాలంలో తొలిసారిగా యుద్ధ నౌక నిర్మాణం చేపట్టడం జరిగింది. దాని తయారీ కొరకు కేంద్ర ధనాగారం నుంచే ధనం వెచ్చించడం జరిగింది. అలాగే మక్కా వాసులు తమ నగరానికి చేరువలో ఓడరేవు కావాలని కోరగా, ఆయన స్వయంగా జిద్దా పర్యటన జరిపి

పరిశీలించారు. ఆ తరువాత ఓడరేవును షుఅయ్బా నుండి జిద్దాకు మార్చడానికి ఆదేశించారు. అప్పటి నుంచి జనం షుఅయ్బా రేవును వదలి ఇప్పటి వరకు జిద్దా రేవునే వాడుతున్నారు.

## సంక్షేమ కార్యక్రమాలు

అనేక దేశాలు ఖిలాఫత్ పాలన క్రిందికి రావడం చేత ప్రభుత్వ ఆదాయం కూడా బాగా పెరిగింది. బావులను త్రవ్వించడం తోపాటు సిపాయీల వేతనాలను ఆ సంవత్సరం పెంచారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం వేతనాలలో పెంపుదల విధానం పాటించడం జరుగుతోంది. అలాగే సరిహద్దుల్లో రక్షణ ఏర్పాట్లు కట్టుదిట్టం చేయడానికి రక్షక భటుల వేతనాలు రెండింతలు చేశారు.

## పింఛన్లు

ముస్లిమ్ సిపాయీల మరణానంతరం వారి కుటుంబాలకు వారి వేతనాలు జారీ చేసే నియమం ప్రారంభించడం జరిగినదీ మహనీయ ఉస్మాన్(ర) కాలంలోనే.

## పోలీసు శాఖ

మహనీయ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్(ర) మరణానంతరం ఆయన జనాజా వెంట వచ్చిన జనం వల్ల చోటు చాల లేకపోయింది. జనాన్ని అదుపు చేసేందుకు వలంటీర్లను నియమించవలసి వచ్చింది. ఆ తరువాత ఇలాంటి సందర్భాల కొరకు నియమబద్ధంగా పోలీసు శాఖ ఏర్పరచడం అవసరమయింది. ఆ విధంగా మహనీయ ఉస్మాన్(ర) కాలంలోనే ప్రప్రథమంగా పోలీసు శాఖ నియుక్తమయింది.

ఈయనే మహనీయ ఉస్మాన్(ర). ఈ లోకం ఎందరో పాలకుల్ని, శ్రీమంతుల్ని, దానగుణ సంపన్నుల్ని, ధర్మపరాయణుల్ని, చూసింది కాని గగన నేత్రం ఉస్మాన్ వంటి వ్యక్తిత్వాన్ని ఎన్నడూ చూడలేదు. ఉస్మాన్, సయ్యిదినా ఉస్మాన్ ఆయన మహోపకారాలు నేటికీ సజీవంగా ఉజ్వలంగా చరిత్ర గ్రంథాలలోనే కాదు ప్రవక్త మస్జిద్ రూపంలోనూ కానవస్తోంది!

❖

రజియల్లాహు అన్హు!!

# ఇస్రాయీల్ సైన్యం దుర్మార్గాలు

**దక్షిణ గాజాలోని** ఒక పాఠశాల భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడిలో 30 మంది పాలస్తీనా శరణార్థులు మరణించారు.

ఖాన్ యూనిస్‌కు తూర్పున ఉన్న అబ్బాసాన్ పట్టణంలో అల్–అవదా పాఠశాలపై ఈ దాడి జరిగింది. ఇందులో కనీసం 53 మంది గాయపడ్డారు. బాధితులు దాదాపు అందరు మహిళలు, పిల్లలే ఉన్నారని పాలస్తీనా వైద్యులు తెలిపారు.

పాఠశాల సమీపంలో హమాస్ సైనిక విభాగానికి చెందిన ఉగ్రవాది ఉన్నాడని, అందుకే ఈ దాడి చేశామని ఇజ్రాయెల్ సైన్యం చెప్పింది. "యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, గాజాలోని మూడింట రెండు వంతుల ఐక్యరాజ్యసమితి నడుపుతున్న పాఠశాలలు దెబ్బతిన్నాయి, కొన్ని బాంబు దాడులకు గురయ్యాయి, చాలా తీవ్రంగా ధ్వంసమయ్యాయి" అని పాలస్తీనా శరణార్థుల కోసం పని చేస్తున్న ఐక్యరాజ్య సమితి ఏజెన్సీ అధిపతి ఫిలిప్ లాజారిని అన్నారు.

ఇప్పుడు గాజాలో పాఠశాలలు సురక్షితమైన విద్యార్జన కేంద్రాలు కాదు. శరణార్థులతో కిటకిటలాడే బాంబుదాడులకు గురయ్యే ప్రమాదకరస్థలాలుగా మారాయని ఆయన అన్నారు.

శనివారం నాడు ఇజ్రాయెల్ నుసైరాత్ లోని అల్–జాన్నీ పాఠశాలపై దాడి చేసింది. ఈ దాడిలో16 మంది మరణించారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆ సమయంలో ఆ పాఠశాల భవనంలో 2,000 మంది శరణార్థులున్నారని ఐక్యరాజ్యసమితి సంస్థ తెలియజేసింది. మరుసటి రోజు, గాజా నగరంలోని హోలీ ఫ్యామిలీ పాఠశాలపై ఇస్రాయీల్ చేసిన దాడిలో నలుగురు మరణించారు. గాజా పౌర రక్షణ సంస్థ తెలిపింది. నుసైరాత్ లో ఐక్యరాజ్య సమితి నడుపుతున్న మరో పాఠశాలపై సోమవారం దాడి జరిగింది.

అంతర్జాతీయ మానవతా చట్టాన్ని ఇస్రాయీల్ దుర్మార్గంగా అతిక్రమించడం కొత్తకాదని ఐక్యరాజ్యసమితి ప్రతినిధులే చెబుతున్నారు. వెంటనే కాల్పుల విరమణకు పిలుపునిస్తున్నారు.

ఇజ్రాయెల్ దాడి కాల్పుల విరమణ చర్చలను దెబ్బతీస్తుందని హమాస్ హెచ్చరించింది.

★ ★ ★

బరువుల్ని ఎత్తుకోండి, భారంగా మారకండి

3

# సత్సంబంధాలే మీ మూలధనం




ముహియుద్దీన్ గాజీ

(గత సంచిక తరువాయి)

### బహిష్కరణకు బదులు సంస్కరణా మార్గాన్ని అవలంబించాలి

ఒక్కోసారి ఏమవుతుందంటే ఏదయినా వ్యవహారం పూర్తిగా చెడిపోయి, అందులో జోక్యం చేసుకోవటం వృథా అనిపించిన తరువాత జనులు ఆ వ్యవహారం గురించి చొరవ తీసుకుంటారు. కాని ఆదిలోనే నేర్పుతో ఆ వ్యవహారాన్ని చక్కదిద్దే ప్రయత్నం చేసివుంటే అది జటిలంగా మారేది కాదు. ఉదాహరణకు- ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం తలెత్తినప్పుడు మొదట్లోనే దానిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తే అది సులువుగా పరిష్కృతం అయిపోతుంది. దానికి బదులు ఆ గొడవను అలాగే వదిలేస్తే పరస్పర నిందారోపణల భారం తడిసి మోపెడవుతుంది. క్రోధాగ్ని జ్వాలలు ఎంత తీవ్రతరమవుతాయంటే, వాటిని ఆర్పటం చాలా కష్టమైపోతుంది.

మీ ఆప్తుల్లో ఎవరి ఇంట్లోనయినా వివాహ మహోత్సవం ఉంటే, మొదటి నుండే అది దురాచారాలకు దూరంగా ఉండేలా సూచనలు చేయాలి. షరీఅత్ ప్రకారం ఆ మహోత్సవం జరిగేలా ప్రయత్నం చేయాలి. మొదట్నుండీ అంటీ అంటనట్లుగా ఉండి, షరీఅత్‌కు విరుద్ధంగా పెళ్ళి జరిగే ఏర్పాట్లు పూర్తయినప్పుడు, చివరి నిమిషాల్లో ప్రసంగాలు చేసి, కీలెరిగి వాతపెట్టడం వల్ల ప్రయోజనం ఉండదు. వృథా ఖర్చులు, వ్యర్థ పోకడలున్న పెళ్ళిని బహిష్కరించటం గొప్ప విషయమేమీ కాదు. ఆ వివాహం సున్నత్ ప్రకారం జరిగేలా మొదటి నుండే సూచనలు చేసి, ఆ ఇంటి వారిని మానసికంగా అందుకు ప్రిపేర్ చేయటం గొప్ప విషయం.

బంధుమిత్రుల, కుటుంబీకుల పిల్లలకు మంచి శిక్షణ ఇచ్చేందుకుగాను వారి తల్లిదండ్రులకు తరచూ సలహాలు ఇస్తూ ఉండాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఉండదు.

### సత్సంబంధాలే మీ పెట్టుబడి

ఇస్లామీయ ఉద్యమానికి అసలు కార్యక్షేత్రం మానవ

సమాజం. మానవ సముదాయంతో సత్సంబంధాలు ఉద్యమ కార్యకర్తల అసలు మూలధనం. ఈ మూలధనం ఎంత అధికంగా ఉంటే అంతే అధికంగా సత్ఫలితాలు వస్తాయని ఆశించవచ్చు. సమాజం ఆలోచనల్ని మార్చాలన్నా, సమాజంలో ఆచార సంప్రదాయాలపై ప్రభావం వేయాలన్నా, సమాజంలోని రుగ్మతల్ని సంస్కరించాలన్నా, సమాజంలో మంచిని పెంపొందించాలన్నా- ఈ క్లిష్టమైన కార్యాల కొరకు ప్రజలతో విస్తృత ప్రాతిపదికన సంబంధాలు ఏర్పరచుకోవటం అవసరం.

సంబంధాలు ఏర్పరచుకోవటానికి సమవయస్కులై ఉండాలన్న షరతు ఏమీ లేదు. స్వభావంలో సారూప్యత ప్రగాఢ స్నేహ సంబంధాల కొరకు చాలా అవసరం. సమాజంలో సత్సంబంధాల ఆవశ్యకతను అర్థం చేసుకున్నవారు ప్రతి మతం, ప్రతి వర్గం వారితో సత్సంబంధాలు ఏర్పరచుకుంటారు. ఈ సత్సంబంధాలు ఎంత అధికంగా, మరెంత ప్రగాఢంగా ఉంటే సమాజంలో సదవగాహన కూడా అంతే అధికంగా ఉంటుంది.

పటిష్టమైన సంబంధాలు పరస్పర సమావేశాల, భేటి ద్వారా రూపుదిద్దుకుంటాయి. సమావేశాల ద్వారానే అవి పరిఢవిల్లుతాయి. కాకపోతే ఆ సమావేశాలు ఎంతో ఆసక్తికరంగా, ఆహ్లాదకరంగా, అలరించే విధంగా ఉండాలి. విసుగు పుట్టించేవిగా ఉండకూడదు.

మనం అవలంబించే ఏ వైఖరి వల్ల విసుగు, విరక్తి పుడుతుందో గమనించటం కూడా అవసరమే. అనవసరంగా చాలాసేపు కూర్చోవటం, తగు విరామం లేకుండా త్వరత్వరగా భేటి అవటం, ఒకే టాపిక్‌పై చాలాసేపు మాట్లాడటం, పాడిందే పాటరా పాచిపళ్ల దాసరి అన్నట్లు చెప్పిన మాటే పదేపదే చెబుతూ ఉండటం - ఇవన్నీ విసుగు పుట్టించే చేష్టలు. తర్జన భర్జన చేయటం మీకు రుచించవచ్చు. కాని ఎదుటి వారికి కూడా అది రుచించాలిగా.

చెప్పవచ్చిందేమంటే, మీరు ఏర్పరచుకునే సంబంధాలు ఇరువర్గాలకు కూడా ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచిపెట్టేవిగా ఉండాలి. ఆలోచింపజేసేవిగా కూడా ఉండాలి.

## సంఘ సేవలో దేనినీ అల్పంగా భావించకండి

సంఘ సేవలో భాగంగా ఎన్నో పనులుంటాయి. వాటి కొరకు పెద్దపెద్ద డిగ్రీలు, కోర్సులు చేసి ఉండాల్సిన అవసరం లేదు. కొద్దిపాటి పరిజ్ఞానం, అభ్యాసం ఉంటే చాలు, వాటిని చేయవచ్చు. మీ దగ్గర ఉన్న ఆ నైపుణ్యమే మిమ్మల్ని ప్రయోజకులుగా చేసేస్తుంది. ఉదాహరణకు-

- ప్రాథమిక చికిత్స (ఫస్ట్ ఎయిడ్) గురించి తెలిసి ఉండటం. గ్రామీణ స్థాయిలో ఇలాంటి వారే ప్రజల పాలిట కారుణ్య దూతలై ఉంటారు.
- కొంతమందికి కొన్ని అరుదైన చిట్కాలు తెలిసి ఉంటాయి. సమయోచితంగా వారు సూచించే ఈ చికిత్స కోసం ప్రజలు వారి వద్దకు ఎగబడి వస్తుంటారు.
- మృతులకు గుసుల్ ఇచ్చే (శవ స్నానం చేయించే) పురుషులు, స్త్రీలకు సమాజంలో ముఖ్యంగా గ్రామాలలో గల ప్రాధాన్యత సాధారణమైంది కాదు.
- దస్తావేజులు తయారు చేయడానికి, విజ్ఞప్తులు చేయడానికి సరైన దస్తూరీ (ఇబారత్) లిఖించేవారి ప్రాముఖ్యం ఎప్పుడూ ఉంటుంది.

ఇవి కొన్ని మచ్చుతునకలు మాత్రమే. ఇలాంటి ఎన్నో పనుల ద్వారా ప్రజా బాహుళ్యంతో సంబంధాలు ఏర్పరచుకుని సత్కార్యాలకు శ్రీకారం చుట్టవచ్చు.

**(ఇంకా వుంది)**

**"జిందగీ-యె-నౌ" సౌజన్యంతో**

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



# ఆహ్! గురువర్యులు అబ్దుర్రహ్మాన్ గారు

- ముహమ్మద్ షరీఫ్, మండపేట

**అబ్దుర్రహ్మాన్ (రహ్మ)** గారి అస్తమయం తండ్రిని కోల్పోయినంతగా బాధిస్తుంది. నా జీవితంలోని కొత్త అధ్యాయానికి ముందు మాట ఆయనదే. రెండు దశాబ్దాల క్రితం ఆయనను మొదటిసారి కడియంలో కలుసుకున్నాను. ఇస్లాం ఒడిలోకి వచ్చాక అల్లాహ్ ఆయన ద్వారానే నాకు కొత్త జీవితాన్నిచ్చాడు. ఇస్లాం మౌలికాంశాలతోపాటు ఇస్లామీయ ఉద్యమాన్ని సైతం ఆయన నాకు పరిచయం చేశారు. నాకు ఎస్ఐఓ ని పరిచయం చేసిందీ ఆయనే. ఆయన రిఫెరెన్స్‌తోనే ఎస్ఐఓ వేసవి శిక్షణా సమావేశాల్లో పాల్గొన్నాను. నా జీవితంపై ఆయన వేసిన ముద్ర చెరగనిది. ప్రతి నెల రెండో శనివారం ఆయన నిర్వహించే శిక్షణా తరగతి ద్వారా నన్ను నేను తీర్చిదిద్దుకునే అవకాశం లభించింది. అందుకే ఆయన నా మురబ్బీ అని వినయంగా చెప్పగలను. అది నా అదృష్టం అనుకుంటాను.

ఆయన సంస్కరణా విధానం సహజ సిద్ధమైనది, సున్నత్‌కి అనుగుణమైంది. సర్కారు జిల్లాల్లో ఆయన వేసిన ప్రభావం చూస్తే ఆయన సంస్కరణా విధానం అర్థమౌతుంది.

మొత్తం రేపూరు గ్రామాన్నే ఆయన మార్చిన తీరు మనలను అబ్బుర పరుస్తుంది. వ్యక్తిని సంస్కరించడానికి మృదు భాషణం, ఒక్కొక్క మార్పు అతనిలో తీసుకురావడం, సంస్కరణ ఆలస్యమౌతుందని అనుకోకుండా ప్రవక్త (స) విధానంలోనే ప్రయత్నించడం, తనకు తానే మారేలా వ్యక్తిని సానుకూలంగా ప్రేరేపించడం ఆయనకే సొంతమైన నైపుణ్యాలు.

గురువు గారూ! ఉద్యమ పని, సందేశం ఇచ్చే నైపుణ్యాలు నేర్పించండి అని అంటే దానికి ఆయన "చూడు బాబూ మనం మన వ్యక్తిత్వం ద్వారానే వ్యక్తులను మార్చగలం" అని అన్నారు.

యువతను అల్లాహ్ ధర్మం కోసం పని చేసేలా ప్రేరేపించడానికి ఆయన "నా ప్రియ కుమారులారా! మా సూర్యుడు అస్తమిస్తున్నాడు, మీ సూర్యుడు ఇప్పుడిప్పుడే ఉదయిస్తున్నాడు, మీ జీవితాలను అల్లాహ్ మార్గంలో వెచ్చించండి" అని యువతను ప్రేరేపించేవారు.

ఆయనలో నేర్చుకోవలసిన ముఖ్యమైన అంశం పరలోక చింతన. అల్లాహ్ వైపునకే మనం మరలిపోతాము అని అనేకసార్లు చెప్తూ ఉండేవారు.

"మనిషి ప్రపంచంలో మునిగిపోకూడదు, అది మంచి విధానం కాదు. జాగ్రత్తగా ఉండాలి, షైతాన్ ఉచ్చులో పడకూడదు అంటూ హితవు గరపడమే కాదు, ఆ భావాలతో జీవించేవారు కూడా. ఇహలోక జీవితానికి ఆయన తన జీవితంలో ఏనాడూ ప్రాధాన్యత ఇవ్వలేదు. అల్లాహ్‌ను కలుసుకోవాలనే తపన ఆయనలో మెండుగా ఉండేది.

కారుణ్య ప్రభువు ఆయన సేవలను దయతో ఆమోదించి, స్వర్గంలో చోటు కల్పించాలని ప్రార్థన. (ఆమీన్)

# షాక్..!

నీ లేలేత పాదాలతో నా గుండెలపై ఆడుతూ ఉంటే
ముద్దు ముద్దుగా ముద్దు చేశాను..
పెరిగి పెద్దవాడివై గుండెల్లో "గునపాలు" దించుతావని
ఊహించలేని అమాయకత్వం నాదు నాది..
భుజాలపై ఎక్కి కొత్త ప్రపంచాన్ని చూసిన నువ్వు..
పెద్దవాడివై నా భుజాలపైనే "స్వారీ" చేస్తావని కలనైనా అనుకోలె...!
వేలు పట్టుకొని బుడిబుడి అడుగులు వేస్తున్నప్పుడు
తడబడొద్దని గట్టిగా పట్టుకున్న..
వృద్ధాప్యంలోనైనా
నీ చేయి ఆసరాతో నన్ను నడిపిస్తావని ..
నేడు నీ చూపుడు వేలే నాకిప్పుడు ధిక్కారమైంది....!?
చెదరిన నా జుట్టును నువ్వు సవరించినప్పుడు..
నీ ప్రేమకు ముగ్ధుడినయ్యా...!
"మీసాలు గడ్డాలు" వచ్చాక
అదే "జుట్టు" పట్టుకొని
నన్ను బజారులోకి లాగుతావని
అనుకోని అజ్ఞానం నాది..!
మీ "అమ్మ" లోటు నీలో కనపడొద్దని..
అమ్మనై అన్ని చేస్తి...
వృద్ధాప్యంలో పితృ ఋణం తీర్చి పేరు తెచ్చుకుంటావని ఆశపడితే..!
"అరబ్ కెమెల్" కథలాగా..
అనాధాశ్రమంలో నేను..!
రంగుల భవంతిలో నువ్వు..!
చివరిగానైనా మీ అమ్మ "సమాధి" పక్కనే నన్నూ ఉంచుతావని..!?

★★★

పాపం పెద్దాయన "షాక్ "లోకి వెళ్ళాడు..
ఎప్పుడు కోలుకుంటాడో మరి..!

- డాక్టర్ మహమ్మద్ హసన్


యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

**ఒక వారం చదవండి**
**ప్రతి వారం చదువుతారు !**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# ద్వేషాన్ని వదిలేద్దాం!

**- షేఖ్ అబ్దుల్ బాసిత్. కొత్తగూడెం**

**ద్వేషించే వారిని ప్రేమించడం అంత సులభం కాదు.**

కానీ ఇది దైవాన్ని విశ్వసించే నిజమైన విశ్వాసుల సుగుణం.

మానవాళి మార్గదర్శి, మానవ జీవిత మర్మాన్ని వివరించిన ఖురాన్‌లో సృష్టికర్త అయిన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

"ప్రవక్తా! మంచీ, చెడూ ఒకటి కావు. నీవు చెడును శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నీ పట్ల శత్రు భావం కలవాడు నీకు ప్రాణస్నేహితుడై పోవటాన్ని నీవు గమనిస్తావు. ఈ సుగుణ యోగం సహనశీలురకు తప్ప మరెవరికీ లభ్యం కాదు. ఈ స్థానం మహా అదృష్టవంతులకు తప్ప మరెవరికీ దక్కదు. ఒకవేళ నీకు షైతాను నుండి ఏదైనా దుష్ ప్రేరణ కలిగితే అప్పుడు అల్లాహ్ శరణు కోరుకో, ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ ఎరిగినవాడూను". (41:34-36)

క్షమించడం దేవుని సుగుణం.

ఖురాన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు : మీపైకి వచ్చిన ఆపద, మీరు మీ చేజేతులా చేసుకున్న దానివల్లనే వచ్చింది. చాలా పొరపాట్లను ఆయన ఇట్టే మన్నించివేస్తాడు.( 42:30)

ఖురాన్‌లో మరోచోట ఇలా సెలవిచ్చాడు:

"చెడుకు ప్రతి క్రియ అదే రకమైన చెడు. కాని ఎవడైనా క్షమించి, రాజీపడితే దానికి ప్రతిఫలం ఇవ్వటం అల్లాహ్ బాధ్యత. అల్లాహ్ దుర్మార్గులంటే ఇష్టపడడు. తమకు అపకారం జరిగినప్పుడు ఎవరైనా ప్రతీకారం చేస్తే, వారిని నిందించటానికి వీలులేదు. అసలు నిందార్హులు ఇతరులకు అన్యాయం చేసేవారే, భూమిపై అన్యాయంగా దౌర్జన్యాలు చేసేవారే. అటువంటి వారికి వ్యధాపూరితమైన శిక్షపడుతుంది. అయితే ఎవరైనా సహనంతో వ్యవహరిస్తే, క్షమించి వేస్తే, అది పెద్ద, సాహసంతో, దృఢ సంకల్పంతో కూడుకున్న పని". (42:40-43)

మానవుడు సంఘ జీవి. మానవ మనుగడ హాయిగా సాఫీగా సాగాలంటే ఒకరికొకరు ప్రేమాభిమానాలు పంచుకున్నప్పుడే అది సాధ్యం అవుతుంది.

ఒకరి పొరపాట్లను మరొకరు క్షమించుకుంటూ పరస్పర ప్రేమాను రాగాలను పంచుకుంటూ ముందుకు సాగిపోవాలి.

ద్వేషం, పగ, ప్రతీకారం మానసిక ప్రశాంతతను దూరం చేస్తాయి. మానసిక ఒత్తిడిని పెంచుతాయి. ఫలితంగా మనం మన సుఖసంతోషాలను చేజేతులా నాశనం చేసుకున్న వారమవుతాం.

సహనం క్షమాగుణం సజ్జనుల సొత్తు. మంచి వారిలో ఉండే సుగుణాలు ఇవి.

"ఇద్దరి మధ్య మనస్పర్థలు లేదా ఏదైనా వివాదం తలెత్తితే వారు మూడు రోజుల కన్నా ఎక్కువ దూరంగా ఉండరాదు. ఎవరైతే ముందుగా అన్ని మరచి తన సోదరునితో కలుస్తాడో అల్లాహ్ అతని పొరపాట్లను మన్నించి వేస్తాడు" అని అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స).

ఒకసారి ప్రవక్త ముహమ్మద్ (స), "బంధుమిత్రులతో సిలారహ్మి అంటే క్షమాగుణం కలిగి వ్యవహరించండి, వారి హక్కులను నేరవేర్చండి" అని బోధించారు.

ఒక సహచరుడు లేచి "అయ్యా! నేను నా బంధువుల హక్కులను నేరవేరుస్తాను. వారితో ఎంత మంచిగా వ్యవహరించినా వారు మాత్రం నాతో మంచిగా వ్యవహరించరు" అని అన్నాడు.

"వారు అలా చేస్తున్నప్పుడు నీవు వారితో మంచితనంతో వ్యవహరించడంలోనే నీ మంచితనం దాగి ఉంది. నిజమైన ముస్లిం లక్షణం కూడా ఇదే" అని అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స).

నిజమే కదా! ఎదుటివారు మంచి వారైతే వారితో మంచిగా

వ్యవహరించడంలో మన గొప్పతనం ఏముంటుంది చెప్పండి?

ఎదుటి వారు మనల్ని ద్వేషిస్తునప్పుడు మనం వారిని ప్రేమిస్తూనే కదా మన గొప్పతనం.

మిత్రులారా! క్షణభంగుర జీవితం. ఏ క్షణం చివరి గడియ అవుతుందో ఎవరికీ తెలియదు. కాటి వరకు మోసుకుని పోవడానికి కనీసం నలుగురైనా కావాలి. వెంట తెచ్చుకున్నది ఏమి లేదు. పోయేటప్పుడు పట్టుకో పోయేది కూడా ఏమీ లేదు.

అలాంటప్పుడు ఎందుకీ పగా ప్రతీకారాలు?

ఒకసారి ప్రవక్త ముహమ్మద్ (స) తన సహచరుడైన జైద్ చేయి పట్టుకొని, "జైద్! మనసులో కల్మషం లేకుండా జీవించగలిగితే జీవించు. ఇది నాతో సంప్రదాయం. నా సంప్రదాయాని అనుసరించే వారు నా పాటు స్వర్గంలో ఉంటారు" అని అన్నారు.

అంటే కల్మషం లేని జీవితం, శత్రువులను సైతం క్షమించే గుణం మనల్ని స్వర్గానికి అర్హులను చేస్తుంది.

అందుకే...

ద్వేషాన్ని వదిలేద్దాం. క్షమించడం నేర్చుకుందాం.

ప్రేమిద్దాం. ప్రేమను పంచుదాం. ప్రేమించబడుదాం.

బ్రతికినన్నినాళ్ళు కల్మషం లేకుండా బతుకుదాం.

ఇహంలోను పరలోకంలోను సుఖమయ జీవితాన్ని జీవిద్దాం.

# అనుభవం అత్యంత ఖరీదైనది

సేకరణ : ఇమామ్‌జీ

**ఒక** పెద్ద ఓడ చెడిపోయింది..

కదలనని మొరాయిస్తోంది..

చాలామంది నిపుణులు వచ్చి చూశారు.

కానీ లాభం లేకపోయింది.

ఎవరూ బాగు చేయలేకపోయారు. ఓడ కదలనంటోంది.

ఊరంతా గాలించి 30 సంవత్సరాల అనుభవం ఉన్న ఒక ఇంజినీర్‌ను వెతికి పట్టుకుని మరమ్మత్తు బాధ్యత అప్పగించారు.

అతను ఓడను పై నుంచి కింది వరకు చాలా జాగ్రత్తగా పరిశీలించాడు.

అంతా చూశాక ఇంజినీర్ తన బ్యాగ్ తెరిచి చిన్న సుత్తిని బయటకు తీశాడు.

ఇంజిన్ దగ్గర ఒక భాగంపై మెల్లగా కొట్టాడు. వెంటనే, ఇంజిన్ మళ్లీ ప్రాణం పోసుకుంది. సమస్య పరిష్కారమైంది!

ఒక వారం తర్వాత ఇంజనీర్ ఓడ యజమానికి ఆ జెయింట్ షిప్ రిపేర్ చేసినందుకు మొత్తం 20,000 డాలర్ల బిల్లు పంపాడు.

ఓడ యజమాని ఆశ్చర్యపోయాడు..

"మీరు చేసింది ఏమీ లేనేలేదు. మహా అయితే అరగంట మాత్రం పనిచేశారు మా కోసం. సుత్తితో చిన్నగా కొడితేనే ఇంజిన్ ప్రాణం పోసుకుంది.. దానికే అంత బిల్లు ఏమిటి? మాకు వివరణ కావాలి.. దేనికి ఎంత ఖర్చో తెలియాలి" అన్నాడు.

ఇంజనీర్ అతనికి సమాధానం పంపాడు:

"సుత్తితో కొట్టడానికి రెండు డాలర్లు"

సుత్తి ఎక్కడ కొట్టాలో, ఎంతమేరకు కొట్టాలో తెలుసుకోడానికి : 19,998 డాలర్లు.

ఒకరి నైపుణ్యం, అనుభవానికి ఇవ్వాల్సిన విలువ అది...

ఎందుకంటే ఎంతో ప్రయత్నం, మరెంతో పట్టుదల, కృషి ఫలితంగానే అనుభవం వస్తుంది.

నేను మీ పనిని 30 నిమిషాల్లో పూర్తి చేసిన మాట వాస్తవమే. కానీ 30 నిమిషాల్లో ఆ పనిని ఎలా చేయాలో నేర్చుకోడానికి నేను 20 సంవత్సరాల పాటు కష్టపడ్డాను" అని వివరణ ఇచ్చాడు ఆ ఇంజనీర్.

మీరు నాకు అన్ని సంవత్సరాల అనుభవానికి డబ్బులు ఇవ్వాలే తప్ప, నేను పనిచేసిన 30 నిమిషాలకు కాదు.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

89 ఆయత్‌లు

# 43. అజ్ జుఖ్రుఫ్

48 మేము ఒకదానిని మించిన మరొక ఘనమయిన నిదర్శనాన్ని వారికి చూపిస్తూ పోయాము, మరి మేము వారిని యాతనలో పట్టుకున్నాము, వారు తమ వైఖరిని మానుకోవాలని.[43]

49 – 50 ప్రతి యాతన సందర్భంలోనూ వారు అనేవారు, "మంత్రగాడా, నీ ప్రభువు ద్వారా నీకు ప్రాప్తమయిన హోదానుబట్టి మా కొరకు నీవు ఆయన్ని వేడుకో, మేము తప్పక సన్మార్గాన్ని అవలంబిస్తాము" అని. కాని మేము వారి నుండి ఆ యాతనను తొలిగించగానే వారు తాము ఇచ్చిన మాటకు విముఖులయిపోయేవారు.[44]

**(43వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

(6) ఆయన ముందుగానే హెచ్చరించిన దాని ప్రకారం దేశంలో మూల మూలన కప్పల వెల్లువ పెల్లుబికి వచ్చింది. అవి పూర్తి జనావాసాన్ని ఇబ్బందిపాలు చేసిపెట్టాయి. అల్లాహ్ పంపిన ఈ సేనలు కూడా మహనీయ మూసా (అ) ప్రార్థన చేయకుండా తిరిగిపోలేదు.

(7) సరిగ్గా ఆయన ప్రకటించినట్లే నెత్తుటి యాతన దాపురించింది. దానివల్ల సకల కాలువలు, బావులు, ఊటలు, చెరువులు, కోనేరులు అన్నింటా నీరు రక్తంగా మారిపోయింది. చేపలన్నీ చనిపోయాయి. ప్రతిచోటా నీటి కొలనుల్లో దుర్గంధం ఏర్పడింది. పూర్తిగా ఒక వారం రోజుల వరకు ఈజిప్ట్ ప్రజలు మంచినీళ్ళ కోసం బాధపడ్డారు. దాన్నుండి ముక్తి కొరకు మహనీయ మూసా (అ) ద్వారా ప్రార్థన జరిపించిన తరువాతనే ఈ విపత్తు కూడా తొలిగిపోయింది. వివరాలకు చూడండి ఖుర్‌ఆన్ అవగాహనం, సం. 3, అల్ ఆరాఫ్ : పాద సూచికలు 94 – 96; సం. 5, అన్ నమ్ల్: పాద సూచికలు 16, 17, సం. 7, అల్ మూ'మిన్ : పాద సూచి 37).

బైబిల్‌లో నిర్గమకాండం: 7,8,9,10,12లోనూ ఈ యాతనల సవివరమయిన గాథలున్నాయి. కాని అదంతా కాకమ్మ కథలూ, వాస్తవాలూ రెంటి కలగూరగంప. అందులో, నెత్తుటి శిక్ష దాపురించినప్పుడు మంత్రగాళ్ళు సయితం అలాంటిది తెచ్చిపెట్టారని ఉంది. కాని పేల శిక్ష మూడినప్పుడు మంత్ర గాళ్ళు దానికి బదులుగా పేలను పుట్టించలేకపోయారు. వారు దాన్ని దైవక్రియగా ప్రకటించారు. ఇంతకన్నా వింతయిన విషయం ఏమిటంటే కప్పలు తెప్పలు తెప్పలుగా వచ్చిపడినప్పుడు మంత్రగాళ్ళు సయితం కప్పల దళాలు తెప్పించారు. కాని ఫిర్‌ఔన్, మహనీయ మూసా(అ)నే అర్థించాడు, అల్లాహ్‌ను వేడుకుని ఈ శిక్ష నుండి కాపాడాలని. మంత్ర గాళ్ళు కప్పల దాడి చేయించడంలో సమర్థులయితే మరి ఫిర్‌ఔన్ వారి ద్వారానే ఈ యాతనను దూరం చేయించుకో లేదెందుకు? ఇంతకు కప్పల ఆ వెల్లువలో దైవం తెప్పించిన వేవో, మంత్రగాళ్ళ కప్పలేవో ఎలా తేలేది? ఇదే ప్రశ్న నెత్తుటి విషయంలోనూ తలెత్తుతుంది. ప్రవక్త మూసా (అ) హెచ్చరిక తరువాత నీటి వనరులన్నీ రక్తంలా మారిపోయినప్పుడు మంత్రగాళ్ళు ఏ నీటిని రక్తంలా మార్చారు? ఫలానా చోటి నీరు మంత్రగాళ్ళ గారడివల్ల నెత్తురయిందని ఎలా తెలిసింది? ఇటువంటి విషయాల వల్లనే తెలిసిపోతుంది బైబిల్ స్వచ్ఛమయిన దైవవచనంతో కూడుకున్నది కాదని. దీన్ని రచించిన వారు ఇందులో తమ కల్పనలతోనూ ఏమేమో చేర్చి వేశారు. జరిగిన ఘోరం ఏమిటంటే, ఆ రచయితలు కూడా ఏదో అతిసాధారణ బుద్ధికుశలత కలవారే. వారికి మాటను కల్పించి రచించే నేర్పు కూడా లేదని చెప్పవలసి వస్తుంది.

44. ఫిర్‌ఔన్, అతని జాతి నాయకుల మొడిపట్టును గురించి దీన్నిబట్టి ఊహించుకోవచ్చు. వారు దైవశిక్షకు ఇక్కట్లపాలయి తాళలేక అది తొలగిపోయేందుకు హ॥జ్రత్ మూసా చేత ప్రార్థన చేయించాలని కోరుకున్నప్పుడు కూడా వారు ఆయన్ని ప్రవక్త అనడానికి బదులు మంత్రగాడనే సంబోధించేవారు. వాస్తవానికి వారు మంత్రతంత్రాల వాస్తవికత ఎరిగినవారు కారు. ఈ మహిమలు ఏ మంత్రతంత్రాల వల్లనూ రూపొంద జాలవన్న విషయం వారు ఎరుగనిది కాదు. ఒక మంత్రగాడు, ఇంద్రజాలికుడు అత్యధికంగా చేయగలిగేదేముంది, ఒక పరిమిత ప్రాంతంలో అతని సమక్షాన ఉన్న జనుల మస్తిష్కాలపైన ప్రభావం వేసి నీరు నెత్తురయి పోయినట్లు భావించేలా చేయగలడు.

**(44వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం

(కితాబుల్ మగాజీ)

అధ్యాయం : 3

### బద్ర్ యుద్ధం[1]

**576)** మహనీయ కాబ్ బిన్ మాలిక్(రజి) చెప్పగా తాను విన్నానని అబ్దుల్లాహ్ బిన్ కాబ్ తెలిపారు: కాబ్ బిన్ మాలిక్(రజి) ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) పాల్గొన్న యుద్ధాలన్నింటిలో నేను పాల్గొన్నాను – ఒక్క తబూక్ యుద్ధం తప్ప. కాకపోతే నేను బద్ర్ సంగ్రామానికి వెళ్ళలేదు. అయితే ఈ యుద్ధంలో పాల్గొనలేకపోయిన వారిలో ఏ ఒక్కరినీ అల్లాహ్ అధిక్షేపించలేదు. ఎందుకంటే ప్రవక్త మహనీయులు (స) ఖురైషు వర్తక బిడారు ఆచూకీ తెలుసుకోవడానికి వెళ్ళారు. (యుద్ధం చేసే ఉద్దేశంతో బయలుదేరలేదు). అయితే అనూహ్యంగా అల్లాహ్ ముస్లింలకు, శత్రువులతో మార్కొనే పరిస్థితిని ఏర్పరచాడు.

**577)** హజ్రత్ ఇబ్నె మస్ఊద్(రజి) ఇలా అన్నారు: నేను మిఖ్దాద్ బిన్ అస్వద్(రజి) ద్వారా ఒక మాట విన్నాను. ఆ మాటే గనక నా నోట వెలువడి ఉంటే, అది నా కొరకు అన్ని విషయాలకంటే కూడా అత్యంత ప్రీతికరమైనదై ఉండేది. ఇంతకీ జరిగిందేమిటంటే, ప్రవక్త మహనీయులు(సఅసమ్) అవిశ్వాసులను అధిక్షేపిస్తూ, దుఆ చేస్తున్న సమయంలో మిఖ్దాద్ అక్కడకు విచ్చేశారు. ఆయన (మిఖ్దాద్) ఇలా అన్నారు: "దైవప్రవక్తా! మేము మూసా(అ) జాతి జనుల మాదిరిగా, 'నీవూ, నీ ప్రభువు పోయి యుద్ధం చేయండి' అని అనేవారము కాము. పైగా మేము మీకు కుడివైపున, ఎడమ వైపున, ముందు వెనుకా ఉండి యుద్ధం చేస్తాము" అని అన్నారు. ఇబ్నె మస్ఊద్ ఇలా అన్నారు: మిఖ్దాద్ ఈ మాట అనగానే దైవప్రవక్త(స) ముఖారవిందం సంతోషంతో ప్రకాశమానమైంది.[1]

3-1. మదీనాకు కొన్ని మైళ్ళ దూరంలో బద్ర్ మైదానం ఉంది. పూర్వం బద్ర్ బిన్ ముఖల్లద్ పేరుతో ఈ గ్రామం వసింపజేయబడినది. లేదా బద్ర్ అనేది ఒక బావి పేరు. హిజ్రీ రెండవ సంవత్సరం రమజాన్ నెల 17వ తేదీ శుక్రవారంనాడు ఖురైషులకు - ముస్లింలకు మధ్యన జరిగిన ఈ యుద్ధం చరిత్రాత్మకమైనది. యుద్ధంలో ముస్లింలు ఘన విజయం సాధించారు. 70 మంది ఖురైషులు వధించబడ్డారు. మరో 70 మంది యుద్ధ ఖైదీలుగా పట్టుబడ్డారు. ఈ యుద్ధంతో మక్కా తిరస్కారుల నడుం విరిగినట్టయింది.

577-1. బద్ర్ యుద్ధ నేపథ్యంలో జరిగిన సంఘటన ఇది. ఖురైషుల వర్తక బిడారు సమాచారం విని దైవప్రవక్త(స) మదీనా నుండి బయలుదేరారు. కాని వర్తక బిడారు మరో దారిగుండా- మక్కా వైపు సాగిపోయింది. సాయుధులైన ఖురైషుల సైన్యం ఎదురుపడింది. క్లిష్టమైన ఆ తరుణంలో దైవప్రవక్త (స) యుద్ధం గురించి తమ అభిప్రాయం ఏమిటో చెప్పమని సహచరమాన్యులను అడిగారు. అప్పుడు ముహాజిర్లు, అన్సార్లు యుద్ధానికి తమ సంసిద్ధతను వెలిబుచ్చారు. అన్సార్లయితే మరింత తెగువను చూపుతూ, తమను 'బర్కుల్ గమాదీ' అనే సుదూర ప్రాంతానికి తీసుకుపోయి యుద్ధం చేయమన్నా వెనుకాడబోమనీ, తమ ధన ప్రాణాలతో పోరాడతామని హామీ ఇచ్చారు. దాంతో దైవప్రవక్త(స) అమితంగా సంతోషించారు.



# ఎలాంటి వైరుధ్యాలు లేని గ్రంథం...

# ఖుర్ఆన్

**- డాక్టర్ సాజిద్ అబ్బాసీ**

**ధర్మం** విషయంలో నిర్బంధంకానీ, బలాత్కారంకానీ లేవు. సత్యవాక్కు అసత్యవాక్కుల నుండి ప్రస్ఫుటం చెయ్యబడింది.
(దివ్య ఖుర్ఆన్ 2: 256)

గ్రంథ ప్రజలలో అల్లాహ్‌నూ, అంతిమదినాన్నీ విశ్వసించని వారునూ, అల్లాహ్, ఆయన ప్రవక్త నిషిద్ధంగా నిర్ణయించిన దానిని నిషిద్ధంగా భావించనివారునూ, ఇంకా సత్యధర్మాన్ని తమ ధర్మంగా చేసుకోనివారునూ అయిన వారికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యండి. వారు స్వయంగా తమ చేతులతో జిజియా ఇచ్చేవరకూ, లోబడి ఉండేవరకూ (వారితో పోరాడండి). (9:29)

ధర్మంలో నిర్బంధం లేదని సూరె బఖరా వాక్యాలు స్పష్టం చేశాయి. ముస్లిం దేశపు సైన్యం ఖడ్గ బలంతో ముస్లిమేతర దేశాన్ని జయించినప్పుడు, ఆ దేశ ప్రజలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వబడుతుంది. ఇస్లామ్‌ను స్వీకరించినా, లేదా తన మతాన్నే అవలంబించినా ఈ స్వేచ్ఛ లభిస్తుంది. వారు ఇస్లామ్ స్వీకరించకపోయినా పౌరులుగా జీవించే పూర్తి స్వేచ్ఛ వారికి ఇవ్వబడుతుంది. జిజియా చెల్లించడమే వారి పౌరసత్వానికి షరతు. ఇస్లామీయ రాజ్యంలో ముస్లిముల నుండి జకాత్ వసూలు చేసినట్లే ముస్లిమేతరుల నుండి జిజియా వసూలు చేస్తారు. మనం ఏ దేశంలో స్థిరపడినా అక్కడి చట్టాలకు అనుగుణంగా పన్నులు కట్టాల్సి ఉంటుంది. పన్నులు చెల్లించకుండా ఎగ్గొట్టడం అంటే అది దేశంపై తిరుగుబాటుతో సమానం. ముస్లిమేతరుల నుండి జిజియాను వసూలు చేయడం అంటే ఇస్లామ్ స్వీకరించమనడానికి బలవంతపెట్టడం ఎంతమాత్రం కాదు.

❖❖❖

ప్రవక్తా! విశ్వాసులతో ఇలా అను : “అల్లాహ్ తరఫు నుండి చెడ్డ రోజులు వస్తాయని భయపడని వారి చేష్టలను క్షమించండి స్వయంగా అల్లాహ్ ఒక వర్గం వారికి వారి సంపాదనకు ప్రతిఫలం ఇవ్వటానికి. (45:15)

గ్రంథ ప్రజలలో అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ విశ్వసించని వారునూ, అల్లాహ్, ఆయన ప్రవక్త నిషిద్ధంగా నిర్ణయించిన దానిని నిషిద్ధంగా భావించనివారునూ, ఇంకా సత్యధర్మాన్ని తమ ధర్మంగా చేసుకోనివారునూ అయిన వారికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యండి. వారు స్వయంగా తమ చేతులతో జిజియా ఇచ్చేవరకూ, లోబడి ఉండేవరకూ (వారితో పోరాడండి). (9:29)

పై రెండు ఖుర్ఆన్ వాక్యాలలో ఎలాంటి వైరుధ్యమూ లేదు. మక్కాలో ముస్లిములు బహు దైవారాధకుల చేతిలో హింసించబడుతున్నప్పుడు అల్ జాసియా వాక్యాలు అవతరించాయి. ముస్లిములు వారిని క్షమించాలని, ఆ బహుదైవారాధకుల పని అల్లాహ్‌యే చూసుకుంటాడని చెప్పబడింది.

మక్కా విజయం తరువాత తౌబా వాక్యాలు మదీనాలో అవతరిం

చాయి. ముస్లిమేతర సైన్యం యుద్ధానికి రావాలని, లేదంటే ఖడ్గాలు వదిలి ముస్లిమ్ రాజ్యంలో పౌరులుగా ఉండాలని పిలుపునిచ్చాడు అల్లాహ్. ముస్లిమేతరులు ఇస్లామీయ రాజ్యంలో పౌరులుగా ఉండవచ్చు. ముస్లిములు జయించిన రాజ్యాలలో ముస్లిమేతరులు పౌరులుగా స్వేచ్ఛాయుత జీవితాన్ని గడిపారన డానికి చరిత్రే సాక్ష్యమిస్తుంది. చాలామంది ఆకర్షితులయి ఇస్లామ్ స్వీకరించారు. ముస్లిమేతర రాజుల చరిత్ర చదివినప్పుడు వారి సైన్యం యుద్ధానికి దిగిన దేశంలో అమాయకులనూ వదిలే వారు కాదని, పిల్లలు, స్త్రీలు, వృద్ధులను దారుణంగా చంపేసేవారు. స్త్రీల మాన మర్యాదలను దోచుకున్నారు. ఇళ్లను కాలబెట్టేవారు, చివరకు పశువులనూ చంపేవారని చరిత్ర పుస్తకాలు చదివితే అర్థమవుతుంది. ఇస్లామ్ ధర్మం యుద్ధాలను కూడా నాగరికంగా మార్చివేసింది. తమతో పోరాడే వారితోనే పోరాడాలే తప్ప అమాయకులపై చేయిచేసుకోవడాన్ని అనుమతించదు. ముస్లిమ్ సైన్యం ఏదైనా దేశంపై దండెత్తినప్పుడు అక్కడి పాలకులతో యుద్ధానికి రండి, లేదంటే లొంగిపోయి పౌరులుగా మారండి అని చెబుతుంది. తమ ఆదాయంలో 1 శాతం ట్యాక్సు కట్టేవారు నిజాయితీ గల పౌరులుగా భావిస్తారు. దీన్ని జిజియాగా పేర్కొంటుంది ఖుర్‌ఆన్. ముస్లిమ్ పౌరుల నుండి జకాత్ వసూలు చేస్తారు. జకాత్ చెల్లించని వారిపై రాజద్రోహం కింద విచారణ జరుగుతుంది.

❖❖❖

వారి స్థితి ఎలా ఉంటుందంటే, ఎప్పుడైనా ఏదైనా అశ్లీలకార్యం వారి వల్ల జరిగిపోతే లేదా ఏదైనా పాపం చేసి, వారు తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నట్లయితే, వెంటనే వారికి అల్లాహ్ జ్ఞాపకం వస్తాడు. అప్పుడు వారు ఆయనను తమ తప్పులు క్షమించు అని వేడుకుంటారు- ఎందుకంటే అల్లాహ్ తప్ప పాపాలను క్షమించగలిగే వాడెవడున్నాడని - వారు తాము చేసిన తప్పులను గురించి బుద్ధిపూర్వకంగా మొండివాదం చెయ్యరు. (3:135)

అల్లాహ్ తప్ప పాపాలను మన్నించే వాడు మరెవ్వరూ లేరని పై వాక్యాలు స్పష్టం చేస్తున్నాయి.

అల్లాహ్, ఆయన ప్రవక్తా, ఏ విషయంలోనైనా ఒక తీర్పు చేసినపుడు విశ్వాసి అయిన ఏ పురుషునికైనా, విశ్వాసురాలైన ఏ స్త్రీకైనా, తరువాత తమ యొక్క ఆ విషయంలో స్వయంగా మళ్లీ ఒక నిర్ణయం తీసుకునే హక్కు లేదు. ఇంకా ఎవడైనా అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు అవిధేయత చూపితే, అతను స్పష్టంగా మార్గభ్రష్టతకు గురిఅయినట్లే. (33:36)

ఇమ్రాన్ సూరా 64వ వచనం ప్రకారం, పాపులు ప్రవక్త వద్దకు వచ్చి, వారి తరపున అల్లాహ్‌ను క్షమించమని కోరితే, వారు అల్లాహ్ కరుణామయుడిగా చూస్తాడు. ఈ వాక్యాలలో ప్రవక్తకు క్షమించే అధికారాలున్నాయని చెప్పబడలేదు. తమను క్షమించమని ప్రవక్త(స)తో అల్లాహ్‌కు సిఫారసు చేయించవచ్చు.

అయితే ప్రవక్త(స) కపటుల కోసం 70సార్లు మన్నింపును అర్థించినా అది స్వీకారయోగ్యం కాదు అని ఖుర్‌ఆన్‌లోని 9వ అధ్యాయం 80వ వచనంలో పేర్కొన్నాడు. అహ్‌జాబ్ సూరాలోనూ దాసులకు క్షమాభిక్ష పెట్టే అధికారం ప్రవక్తకు ఇవ్వలేదన్న విషయం స్పష్టం చేశాడు. ప్రవక్త పట్ల అవిధేయత చూపడమనేది అల్లాహ్ అయిష్టతకు కారణమవుతుంది. ప్రవక్త (స) పట్ల అవిధేయతలో అల్లాహ్ అవిధేయత ఉంది.

❖❖❖

ఇబ్రాహీం (అలైహిసల్లాం), ఈసా (అలైహిస్సలాం)లను కూడా 'ముస్లిం' అనే పిలుస్తారు,"అందరికంటే ముందు స్వయంగా నేను ముస్లిమ్ అయిపోవాలని కూడ నాకు ఆజ్ఞ ఇవ్వబడింది.'" (39:12)

అల్లాహ్‌ను కాదని నేను మరెవరినయినా నా సంరక్షకుడుగా చేసుకోవాలా?" ఇలా చెప్పు: అందరికంటే ముందు నేను ఆయనకు విధేయుణ్ణి కావాలని నన్ను ఆదేశించటం జరిగింది. (ఇంకా ఇలా తాకీదు ఇవ్వబడింది. ఎవరైనా షిర్క్ చేస్తే చెయ్యనీ) "నీవు మాత్రం ముష్రిక్కులలో కలసిపోవద్దు.'(6:14)

పై మూడు ఖుర్‌ఆన్ వాక్యాలలోనూ ముహమ్మద్ (స) మొట్టమొదటి ముస్లిమ్ అని చెప్పబడింది.

"మేము నిర్ణయించిన సమయానికి సరిగ్గా అతను చేరినప్పుడు, అతని ప్రభువు అతనితో సంభాషించాడు. అప్పుడు అతను ఇలా మనవి చేశాడు : "ప్రభూ! నా చూపునకు బలాన్ని ప్రసాదించు. నిన్ను చూస్తాను." ఇలా సెలవిచ్చాడు : "నీవు నన్ను చూడలేవు. కొంచెం, ముందున్న ఆ కొండవైపు చూడు. అది తన స్థానంలో స్థిరంగా ఉంటే అప్పుడు నీవు నన్ను చూడగలవు." ఆ ప్రకారం అతని ప్రభువు ఆ కొండపై తన తేజస్సును ప్రసరింపజేసి దానిని భస్మం చేసేశాడు. మూసా స్పృహతప్పి పడిపోయాడు. తెలివి వచ్చిన తరువాత ఇలా అన్నాడు: "నీవు పరిశుద్ధుడవు. నేను నీ సన్నిధిలో పశ్చాత్తాపపడుతున్నాను. అందరికంటే మొదట నేనే విశ్వసిస్తున్నాను". (7:14)

పై వాక్యంలో హజ్రత్ మూసా (అలైహి)ను ఈ సృష్టిలో మొట్టమొదటి ముస్లిమ్‌గా పేర్కొనబడింది. ఒక చోట ముహమ్మద్

(స) మొట్టమొదటి ముస్లిమ్ అని పేర్కొనగా మరోచోట మూసా (అలై) తొలి ముస్లిమ్ అని పేర్కొనడం వైరుధ్ధ్యం కాదా?

ఈ ఉపదేశాన్నే యాఖూబ్ కూడా తన సంతానానికి చేశాడు : "నా బిడ్డలారా! ఈ ధర్మాన్నే అల్లాహ్ మీ కొరకు ఎన్నిక చేశాడు. కనుక మీరు మరణించే వరకూ ముస్లిములుగానే ఉండండి." (2:132)

ఈ వాక్యంలో ఇబ్రాహీము (అలై)ను అనుసరిస్తూ యాఖూబ్ (అలై) తమ సంతానానికి చనిపోయేవరకూ ముస్లిములుగా ఉండాలని హితోపదేశం చేశారు.

ఇస్రాయీలు వంశస్థుల అవిశ్వాసాన్ని, తిరస్కారాన్ని పసి గట్టిన ప్పుడు ఈసా ఇలా అన్నాడు: "అల్లాహ్ మార్గంలో నాకు సహాయకులుగా ఎవరు ఉంటారు?" అప్పుడు హవారీలు ఇలా జవాబు పలికారు : "మేము అల్లాహ్‌కు సహాయకులం. మేము అల్లాహ్‌ను విశ్వసించాము. మేము ముస్లిములము (అల్లాహ్‌కు విధేయులము)అనే విషయానికి మీరు సాక్షిగా ఉండండి. (3:52)

నేను హవారీలకు, "నన్నూ నా ప్రవక్తను విశ్వసించండి" అని సూచించినప్పుడు వారు "మేము విశ్వసించాము, మేము ముస్లిములము అయ్యామన్న దానికి నీవే సాక్షి" అని అన్నారు. (5:111)

పై రెండు వాక్యాలలోనూ ఈసా(అలై) శిష్యులు మేము ముస్లి ములము అని ప్రకటించారు.

అరబీలో ముస్లిమ్ అంటే అల్లాహ్‌కు విధేయత చూపేవారు అని అర్థం.

అన్ని కాలాల్లోనూ అల్లాహ్, తన ప్రవక్తలను పంపాడు. విభిన్న కాలాలలో తన ధర్మం విభిన్నంగా ఉండేది కాదు. అన్ని కాలాలకూ ఒక్కటే ధర్మాన్ని పరిచయం చేశాడు.

అరబీలో ఈ ధర్మాన్ని ఇస్లామ్ అని అంటారు. అల్లాహ్‌కు విధేయత చూపేవారిని ముస్లిమ్ అంటారు. ముస్లిమ్ అవడం ఒక లక్షణం. ఇతర మతాల మాదిరిగా ఇస్లామ్ ధర్మం ఏ ఒక్క ప్రత్యేక జాతికో, ప్రాంతానికో పరిమితం కాదు. ఇస్లామ్ సార్వత్రిక ధర్మం. సృష్టిలోని ప్రతీ వస్తువునూ ముస్లిమ్‌గా పేర్కొంటున్నాడు అల్లాహ్. ఎందుకంటే సృష్టి యావత్తు అల్లాహ్ చట్టానికి కట్టుబడి నడుచుకుంటున్నది.

ఇక ఈ ప్రజలు అల్లాహ్‌కు విధేయత చూపే విధానాన్ని (అల్లాహ్ ధర్మాన్ని) వదలిపెట్టి, మరొక విధానాన్ని దేన్నయినా కోరుతున్నారా ఏమిటి? వాస్తవంగా భూమ్యాకాశాలలో ఉన్న సకల వస్తువులూ ఇష్టం ఉన్నా ఇష్టం లేకపోయినా అల్లాహ్ విధేయతకు కట్టుబడి ముస్లిములై ఉన్నాయి. (3:83)

ఇస్లామ్ ధర్మం అల్లాహ్ అవతరింపజేసిన ధర్మం. ఏ ప్రవక్త వచ్చినా మొట్టమొదట చెప్పిన విషయం ఒక్కటే, "అల్లాహ్‌కు విధేయత చూపిన మొదటి వ్యక్తిని నేను." ప్రతీ జాతిలో అల్లాహ్‌కు విధేయత చూపే మొదటి వ్యక్తి ప్రవక్తే అయి ఉంటాడు. 'నేను ముస్లిమ్‌ను అని ప్రకటిస్తాడు.

❖❖❖

ప్రవక్తయే దీనిని స్వయంగా రచించాడని ఈ ప్రజలు అంటున్నారా ఏమిటి? ఇలా అను : "మీరు గనక మీ ఆరోపణలో సత్యవంతులే అయితే ఇటువంటి సూరా ఒకదానిని రచించి తీసుకురండి. ఒక్క అల్లాహ్‌ను వదలి ఎవరెవరిని పిలువగలరో సహాయం కొరకు పిలవండి." (10:38)

ప్రవక్తయే స్వయంగా ఈ గ్రంథాన్ని కల్పించాడని వారు అంటున్నారా? ఇలా అను : "సరే విషయం గనక ఇదే అయితే ఇటువంటి కల్పించబడిన పది సూరాలను మీరు రచించి తీసుకు రండి. అల్లాహ్‌ను తప్ప, (మీ ఆరాధ్య దైవాలలో) ఎవరినైనా సరే సహాయం కొరకు పిలువ గలిగితే పిలుచుకోండి, మీరే గనక (వారిని ఆరాధ్య దైవాలుగా భావించటంలో) సత్యవంతులే అయితే. (11:13)

పై వాక్యాలలో వైరుధ్ధ్యం లేదా?

ఎటువంటి వైరుధ్యమూ లేదు, మొదటి ఛాలెంజ్‌లో పది సూరాలను తయారు చేయమని చెప్పాడు. కనీసం ఒక్క సూరాను అయినా రచించండి అంటూ అల్లాహ్ తుది ఛాలెంజ్‌లో సులభతరం చేశాడు.

❖❖❖

ఆయన ఆకాశాలను, భూమినీ ప్రభవింపజేసినవాడు. ఆయనకు ఒక జీవిత సహచరి అంటూ లేనప్పుడు ఆయనకు కొడుకు ఎలా ఉంటాడు? ఆయన ప్రతి వస్తువును పుట్టించాడు. ఆయనకు ప్రతి వస్తువును గురించీ తెలుసు. (6:101)

మర్యమ్ "నాకు పుత్రుడు ఎలా పుడతాడు, నన్ను పురుషుడు ఎవడూ తాకనైనా లేదు, నేను చెడు నడత గల దానినీ కాను" అని అన్నది. దైవదూత ఇలా అన్నాడు, "అలాగే జరుగుతుంది." నీ ప్రభువు, "అలా చేయటం నాకు చాల సులభం. ఆ బాలుణ్ణి ప్రజల కొరకు ఒక సూచనగా, మా తరపు నుండి ఒక కారుణ్యంగా చేయాలని మేము ఈ పని చేస్తున్నాము. ఇది జరిగి తీరవలసిన విషయమే" అని సెలవిస్తున్నాడు. (19:20-21)

అల్లాహ్‌కు జీవిత భాగస్వామి లేనప్పుడు కొడుకు ఎలా పుడతాడు? అనే విషయాన్ని మొదటి ఖుర్ఆన్ వాక్యంలో ప్రశ్నించాడు. రెండో వాక్యానికి వచ్చేసరికి అల్లాహ్ కోరుకుంటే, పురుషుడి అవసరం లేకుండానే స్త్రీకి సంతాన భాగ్యాన్ని కలిగించగలడు. కొడుకును పుట్టించగలడు అని చెప్పబడింది.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సూరా 112లో అల్లాహ్ ఒక్కడే. అతనికి సాటి ఎవరూ లేరని చెప్పాడు. ఆయన ఎవరి సంతానమూ కాదు, ఆయనకు సంతానమూ లేదు. సాటిలేని వాడు, అద్వితీయుడు. ఈ చిన్నపాటి సూరాలో అల్లాహ్ గుణగణాలను స్పష్టపరిచాడు. అల్లాహ్‌కు భార్యా పిల్లల అవసరం లేదు. అల్లాహ్ మానవ బలహీనతలకు అతీతుడనే విషయాన్ని ఖుర్ఆన్ స్పష్టం చేస్తుంది. అల్లాహ్‌కు తన వంశాన్ని నిలబెట్టుకోవడానికి భార్యా, పిల్లలు అవసరమేలేదు. రెండో ఆయతులో తన మహత్యాన్ని వివరించాడు. తల్లి-తండ్రి లేకుండా ఆదమ్‌ను సృష్టించినట్లే, తండ్రి లేకుండానే తల్లి గర్భంలో యేసుకు ప్రాణం పోశాడు. తనను ప్రవక్తగా పుట్టించాడని ఊయలలో ఉన్న నవజాత శిశువుతో చెప్పించాడు. సర్వ శక్తివంతు డైన అల్లాహ్ ఈసా (అలై)కు ఎన్నో మహత్యాలను ఇచ్చాడు. దీంతో బనీ ఇస్రాయీల్ ప్రజలు ఈసాను నిజమైన ప్రవక్తగా విశ్వసించారు. ఈసా (అలై) చేసిన అద్భుతాలను కళ్లారా చూసినప్పటికీ ఇస్రాయీలీలు ఆయన్ను తిరస్కరించారు. ఆయన తల్లి మర్యమ్ పై అభాండాలు మోపారు.

ప్రవక్తా! మేము నీ ప్రభువు ఆజ్ఞ లేకుండా క్రిందికి దిగిరాము. మా ముందు ఉన్నదానికీ, మా వెనుక ఉన్నదానికీ, ఈ రెండింటి మధ్య ఉన్నదానికీ, ప్రతిదానికీ  ప్రభువు ఆయనే. నీ ప్రభువు ఎన్నడూ మరచిపోయేవాడు కాడు. (19:64)

మూసా, "దానికి సంబంధించిన జ్ఞానం నా ప్రభువు వద్ద ఒక గ్రంథంలో సురక్షితంగా ఉంది. నా ప్రభువు పొరపాటూ చెయ్యడు, మరవడు కూడాను" అని సమాధానం పలికాడు. (20:52)

పై ఖుర్ఆన్ మాటలు అల్లాహ్ మరిచిపోడు అని చెబుతున్నాయి. కపటులైన పురుషులూ, కపటులైన స్త్రీలూ అందరూ ఒకే కోవకు చెందినవారు  వారు చెడును చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. మంచిని చెయ్యవద్దు అని వారిస్తారు. ఇంకా తమ చేతులను మేలుచేయకుండా ఆపుతారు. వారు అల్లాహ్‌ను మరచిపోయారు. కనుక అల్లాహ్ కూడా వారిని మరచిపోయాడు. నిశ్చయంగా ఈ కపటులే ద్రోహులు. (9:67)

"మీరు ఈనాటి సమావేశాన్ని మరచిపోయిన విధంగానే, మేము కూడ ఈనాడు మిమ్మల్ని మరచిపోతాము. మీ నివాసం ఇక నరకమే. మీకు సహాయం చేసేవాడెవడూ లేడు." (45:34)

ఇది వైరుధ్యం కాదా?

మర్యమ్, తాహా సూరాలలో అల్లాహ్ ఎన్నటికీ మరిచిపోడు అని ఉంది. తౌబా, జాసియా సూరాలలో మాత్రం అల్లాహ్ మరిచి పోతాడు అని ఉంది. కపటులైన స్త్రీలు, కపటులైన పురుషులు అల్లాహ్‌ను మరిచిపోయినందుకు అల్లాహ్ కూడా వారిని విస్మరించాడు. వారిని మార్గభ్రష్టత్వంలోనే ఉంచాడు. సూరహ్ జాసియా 34వ వాక్యంలో ప్రళయం రోజు అల్లాహ్  అవిశ్వాసులను ఉద్దేశించి చెప్పే మాటలను ఉటంకించాడు. ప్రపంచంలో బ్రతికి ఉన్నప్పుడు అవిశ్వాసులు అల్లాహ్ ను కలుసుకోవాలన్న విషయాన్ని మరిచిపోయినట్లుగానే ఈ రోజు అల్లాహ్ వారిని విస్మరిస్తాడన్న విషయం చెప్పాడు. అంతేగానీ ఈ వాక్యాల భావం అల్లాహ్ మరుపు చెందేవాడన్నది కాదు.

ఖుర్ఆన్ గ్రంథంలోని పలు వాక్యాలలోని వైరుధ్యాలను చూపించి విమర్శించాలనే విఫలయత్నాలు చేశారు ఇస్లామ్ విరోధులు. ఈ ఖుర్ఆన్ గ్రంథం మానవ రచన అయి ఉంటే ఇందులో ఎన్నో వైరుధ్యాలుండేవి. ఇది మానవ రచన కాదు అని ఖుర్ఆన్ గ్రంథం 1400 సంవత్సరాలుగా సవాలు చేస్తోంది. ఖుర్ఆన్ గ్రంథంలోని పాఠ్యాంశాలలో ఎలాంటి వైరుధ్యాలు లేకపోవడమే ఖుర్ఆన్ అల్లాహ్ గ్రంథం అనడానికి నిదర్శనం. "త్వరలోనే వారికి మా సూచనలను వారి చుట్టూ ఉన్న ప్రపంచంలోనూ చూపిస్తాము, వారిలోనూ చూపిస్తాము. చివరకు ఈ ఖురాన్ నిస్సందేహంగా సత్యమైనదని వారికి విశదమైపోతుంది." (41:53)



కథ

- షహనాజ్ బేగం, అనంతపురం



# అతిక్రమించిన హద్దులు ముడిపడని జీవితాలు

**ఆ రోజు ఆదివారం...** తీరుబడిగా కూర్చున్నాను. ఇంట్లో అందరూ బయటికి వెళ్ళారు. టీవీలో వార్తలు చూద్దామని కూర్చున్నాను.

టీవీ ఆన్ చెయ్యగానే ఏదో వార్త వస్తోంది. అందులో రాజకీయ నాయకులు దుర్భాష లాడుకుంటున్నారు. కుమ్ములాడుకుంటున్నారు. ఒకరిపై మరొకరు నిందారోపణలు చేసుకుంటున్నారు. ప్రజల సమస్యల గురించి అసలు చర్చించుకోవటంలేదు. మరొక వార్తలో మొన్నటివరకు మరో పార్టీలో ఉండి ప్రస్తుతం అధికార పార్టీలో చేరిన ఒక నాయకుణ్ణి పరస్పరం ఆలింగనం చేసుకుంటూ ప్రాణ స్నేహితుల్లా మెలుగుతూ కన్పిస్తున్నారు. మొన్నటివరకు బద్ధ శత్రువులన్న మాటని మరచిపోయినట్టున్నారు. అందుకే అంటారేమో రాజకీయాలలో శాశ్వత శత్రువులుండరని. రాజకీయం అంటే ఇదేనేమో!

అది చూడలేక మరొక చానెల్‌ని మార్చాను. అక్కడా చేదు వార్తలే. వ్యధాభరితమైన సంఘటనలే. అమ్మాయిలపై హత్యాచారాలు ఒకవైపు అయితే, మరోవైపు అమ్మాయిల ఆగడాలు, నేరాలు మరోవైపు.

బేజారెత్తిపోయిన నేను ఠక్కున టీవీని కట్టేశాను. ఇంతలో నా మొబైల్ మోగింది. తీసి చూశాను. అది నా మిత్రుడు షరీఫ్ చేశాడు.

పరస్పరం సలాముల తర్వాత "ఇంట్లోనే ఉన్నావా భాయ్? నీతో అర్జంటుగా మాట్లాడాలి. ఒక సమస్య వచ్చి పడింది" అన్నాడు షరీఫ్.

అతని కంఠస్వరం అదోలా ఉంది.

'అరె భాయ్.. వచ్చేసెయ్. ఇంట్లో కూడా ఎవరూ లేరు. నీ కోసం వెయిట్ చేస్తుంటాను" అన్నాను అతనిని ఆహ్వానిస్తూ.

అతని ఇల్లు దూరంలో లేదు. రావటానికి పదిహేను ఇరవై నిమిషాలు పడ్తుంది. అంతే. అతని కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను.

అతను రానే వచ్చాడు. ఎందుకో అతని మొహం కళావిహీనంగా ఉంది. మనిషి అదోలా కన్పిస్తున్నాడు. ఏదో పెద్ద సమస్యతో సతమతమవుతున్నట్లు అనిపించింది నాకు.

అతనికి త్రాగడానికి మంచి నీళ్ళందించాను.

అతనేదో చెప్పటానికి ప్రయత్నిస్తున్నట్లు గమనించాను. ఏదో గుర్తుకొచ్చి నేను మాట్లాడాను.

"మీ కొడుకు పెళ్ళి అంటకదా. పెళ్ళి పనులు జరుగుతున్నాయి అనుకుంటాను. షాదీఖానా బుక్ చేశావా? షాపింగ్ వగైరాలు పూర్తయ్యాయా? విందు ఏర్పాట్లు చేశావా?

అతను 'హుష్.. అంటూ భారంగా ఓ నిట్టూర్పును వదిలాడు. తలను అడ్డంగా తిప్పాడు.

నేను అర్థం కానట్టు చూశాను.

ఈసారయినా అతని కొడుకు పెళ్ళి సక్రమంగానూ, ఏ ఆటంకం లేకుండా జరగబోతున్నందుకు సంతోషిస్తున్నాను. ఎందుకంటే ఇదివరకు రెండుసార్లు పెళ్ళి సంబంధాలు కుదిరి తీరా పెళ్ళిదాకా వచ్చి ఆగిపోయాయి. కారణాలు తెలియవు.

కానీ షరీఫ్ వాలకం చూస్తుంటే ఏదో జరుగుతున్నట్లనిపించింది.

కొద్దిసేపయిన తరువాత అతను చెప్పిన విషయాలు విని దిగ్భ్రాంతి చెందాను.

ఇదివరకు పెళ్ళిళ్ళు ఆగిపోవటానికి కారణాలను కూడా చెప్పేశాడు.

ఆశ్చర్యపోవటం నా వంతయింది.

ఏమిటీ కాలం ఇలా దాపురించింది. నేటి యువతీ యువకులు బరి తెగించిపోతున్నారు. పెళ్ళికాక మునుపే, పెళ్ళి నిశ్చయం కాగానే సెల్‌ఫోన్‌లలో గంటల తరబడి ముచ్చట్లు చెప్పుకోవడమేమిటి? విచిత్రం కాకపోతే!

ఒక్కోసారి వీడియోలలో పరస్పరం చూసుకుంటూ కబుర్లాడుకుంటారట. పెళ్లి కాకమునుపే నికాహ్ జరగక మునుపే, కాబోయే

వధూవరులు అన్న ధీమాతో మాట్లాడుకోవటం తప్పు కదూ!

కానీ నేడు ఆడపిల్లలు, మగపిల్లలు వాటిని ఉల్లంఘించి, స్వేచ్ఛగా మసలుకుంటూ లేనిపోని సమస్యలలో కూరుకు పోతున్నారు.

ఇలాగే షరీఫ్ కొడుకు కూడా తనకు నిశ్చయమైన అమ్మాయిలతో పెళ్ళికి ముందే చాటింగ్ చేసేవాడట. మాటల్లో ఏదో తేడా వచ్చి మాటకు మాట పెరిగి సంబంధాలు త్రెంచుకునే వరకు వచ్చేదట వ్యవహారం. అలా రెండు సంబంధాలు తప్పిపోయాయట.

"నాకు ఆ అమ్మాయి వద్దు. నోరు పెద్దది. నేనా అమ్మాయిని భరించలేను. ఈ పెళ్ళి క్యాన్సిల్ చెయ్యండి' అంటూ నిష్కర్షగా చెప్పేశాడట. చేసేది లేక తల్లిదండ్రులు కొడుకు మాట ప్రకారం పెళ్ళిని ఆపేశారట.

ఆధునికత యొక్క పర్యవసానం ఇది కదా. ఈ తరం పిల్లచేష్టలు కాకపోతే! మా తరంలో ఇలాంటివి జరిగేవా? పెద్దలు కుదిర్చిన పెళ్ళి సంబంధాలనే చేసుకునేవారు. పెళ్ళయ్యే వరకు చాలామంది కనీసం ఒకరి ముఖాలు ఒకరు చూసుకునేవారు కాదు. పెళ్ళయిన తరువాతనే వారి జీవితాలు ప్రారంభమయ్యేవి. వారి దాంపత్య జీవితంలో ఎలాంటి లోటు ఉండేది కాదు.

పెళ్ళంటే నూరేళ్ళ పంట అన్న నానుడిని నిజం చేసి చూపించే వారు. కానీ ప్రస్తుత కాలంలో ఆధునికతను సంతరించుకుని ఒకర్నొకరిని అర్థం చేసుకుని పెళ్ళి చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో కలుసుకోవడాలు, మాట్లాడుకోవడాలతో ఒరిగిందేమిటి?

విడిపోవడాలు, విడాకుల కేసులు ఎక్కువయ్యాయి. పూర్వం భార్యాభర్తలు కొట్టుకున్నా, తిట్టుకున్నా కడవరకు కలిసే జీవించే వారు. జీవితాంతం ఒకే వ్యక్తిని జీవిత భాగస్వామిగా ఎంచుకుని జీవించేవాళ్ళు. కాని ఇప్పుడు...?

షరీఫ్ ఒక్కో ఉదంతాన్ని చెబుతుంటే మౌనంగా వింటుండి పోయాను. లోలోన అలజడి, ఆవేదన కలుగుతున్నాయి.

ఇటీవల జరగవలసిన పెళ్ళి ఆగిపోవటానికి కారణం. ఒకరోజు కాబోయే వధువు అబ్బాయికి వీడియో కాల్‌లో మాట్లాడిందట. ఆ సమయంలో ఆ అమ్మాయి కురచ దుస్తులు ధరించి ఉందట. ఎబ్బెట్టుగా ఉన్నాయట. అతనికిలాంటివి ఇష్టం ఉండవు. ఆ సందర్భంలో అబ్బాయి అమ్మాయితో 'నాకు నువ్వు ఇలాంటి బట్టలు వేసుకోవటం ఇష్టం లేదు. వెళ్ళి మరో డ్రెస్ వేసుకునిరా. అప్పుడు మాట్లాడుకుందాం. అసలు ఇలాంటి బట్టలు వేసుకోవడానికి మీ పెద్దలు ఎలా అనుమతిస్తారు' అని అన్నాడట.

అతని మాటలను విని ఆ అమ్మాయికి కోపం వచ్చేసిందట. తనకిష్టమైన బట్టలను వేసుకుంటానని అరిచినట్టు చెప్పిందట. ఇద్దరి మధ్య మాటకు మాట పెరిగిందట. చాలాసేపు వాదులాడు కున్నారట.

చివరికి ఆ అమ్మాయి అబ్బాయిని చేసుకోనని తెగేసి చెప్పేసిందట. ఆ అబ్బాయి కూడా తక్కువ తిన్లేదు. అతను కూడా ఈ పెళ్ళి చేసుకోనని కూర్చున్నాడట.

వారి పెద్దలు జరిగిన దానిని జీర్ణించుకోలేక తలలు పట్టుకుని కూర్చుండి పోయారట. వివాహ ఏర్పాట్లన్నీ జరిగిపోయాక పెళ్ళి దగ్గర పడుతున్న రోజుల్లో పెళ్ళి ఆగిపోతే, ఇది ఇరు కుటుంబ గౌరవ ప్రతిష్టలకు సంబంధించినది.

పూర్వం పెద్దలు చెప్పినట్లు పిల్లలు నడుచుకునేవారు. ఇప్పుడు పిల్లలు చెప్పినట్లు పెద్దలు వినవలసి వస్తోంది. పెద్దల పట్ల ప్రేమ గానీ, గౌరవం కానీ లేదు. భయభక్తుల్లేవు. తరువాత చాలాసేపటి వరకు నేను, షరీఫ్ ఈ విషయంపై చర్చించుకున్నాము.

ఇలాంటి విషయాలను ఉపేక్షించకూడదు. అతనికి ఒక మిత్రునికి సహాయ పడేటట్లుగాక. ఈ సమాజంలోని ఒక బాధ్యుడిగా నా కర్తవ్యాన్ని నిర్వహించాలనిపించింది.

కార్యరంగంలోకి దిగాను. నాతోపాటు కొందరు పెద్ద మనుషులను తీసుకుని కాబోయే వధువు ఇంటికి చేరుకున్నాను. వధువు తరపువాళ్ళు, నాకు దూర బంధువులు కావటంతో నా సంకల్పం సులువైంది.

మొదట అమ్మాయికి కౌన్సిలింగ్ చేశాము. చూస్తుంటే అమ్మాయి అమాయకురాలిగానే కన్పిస్తున్నది. పరదా ప్రాముఖ్యతను తెలియ జేస్తూ పెళ్ళికాక మునుపే ఒక మగవాడితో గంటల తరబడి మాట్లాడటం ఎంత తప్పో తెలియజేస్తూ వివాహం తరువాత భార్యాభర్తల బంధం ఎంతో పవిత్రమైనదని, జీవితాంతం ఆ ప్రేమ బంధాన్ని నిలుపుకోవాలని, హేయమైన చేష్టలతో దిగజారుడు తనంతో తమ జీవిత భాగస్వామి దృష్టిలో చులకనయి పోకూడదని నేను నాతోపాటు వచ్చిన పెద్దలు హితోపదేశం చేశాము.

ఆ అమ్మాయి తన తప్పును తెలుసుకున్నట్లు కళ్ళ నీళ్ళ పెట్టుకుంది. తరువాత ఆ ఇంట్లో ఉన్న సభ్యులను మందలించడం జరిగింది. ఒక ఆడపిల్ల ఒక పరాయి పురుషుడితో గంటలకొద్దీ కబుర్లు చెబుతుంటే మీరేమి చేస్తున్నట్లు. వాళ్ళంతా సిగ్గుతో తల దించుకున్నారు.

షరీఫ్‌ని అమ్మాయితోపాటు ఆమె కుటుంబసభ్యులు క్షమాపణలు కోరారు.

తరువాత షరీఫ్ కొడుకు దగ్గరికి చేరాము. అక్కడా అదే సీన్ రిపీట్ అయింది. మా మాటలు విని ఎంతో స్పందించాడు. పెద్దలందరికీ బాధ పెట్టినందుకు క్షమించమని కోరాడు. ఆ అమ్మాయి పట్ల తనకు ప్రేమ లేకపోలేదని, ఎందుకో ఆ రోజు అలా ఆవేశపడ్డానని చెప్పాడు. చూస్తుంటే ఆ ఇద్దరికీ ఒకరిపట్ల మరొకరికి ఇష్టమూ, ప్రేమ ఉన్నట్లు తేలింది.

చివరికి అనుకున్న ప్రకారం, అనుకున్న తేదీకే వారి వివాహం జరిగిపోయింది.

❖

# ప్రేమను పంచిపెట్టండి

**- ఎస్.ఎమ్. మలిక్**

**దైవప్రవక్త** మహనీయులు ముహమ్మద్(స) జీవితం యావత్తు సందేశ ప్రధానమయింది. అందులో అనేక బాధాకరమయిన సంఘటనలు, వ్యధాభరితమయిన ఉదంతాలు, ఆవేదనా పూర్వకమయిన సన్నివేశాలు ఆసన్నమయ్యాయి. వాటిలో చెప్పుకోదగ్గవి ఎన్నో! కానీ మరీ ముఖ్యంగా రెండు సంఘటనలు ఎంతో దుఃఖదాయకంగా ఎదురయ్యాయి. ఒకటి, బనీ హాషిమ్ తెగపైన సంఘ బహిష్కరణా వేటు. ఆ సందర్భంలో ప్రవక్త బాబాయి అబూ తాలిబ్ తన సోదర సుతుడు ప్రవక్తను, ఆయన అనుయాయుల్ని పరిరక్షించడానికి తనకు కుమ్మక్కుగా తన తెగవారినీ తీసుకుని 'అబూ తాలిబ్ వీధి'లో భద్రతతో ఉండ గలమన్న ధీమాతో కలసి నివసించారు. మూడేళ్ల ఆ బహిష్కరణా కాలంలో వారికి, ఎవరయినా సానుభూతితో ఆహార ధాన్యాలు సయితం సరఫరా చేయడానికి అనుమతించలేదు కురైషీ ముష్కరులు. ఫలితంగా బహిష్కరణకు గురయినవారిలో అనేక మంది బాలురు, యువకులూ ఆకలిదప్పులకు తట్టుకోలేక ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది.

కురైషీల ఈ దౌర్జన్యాన్ని, అక్రమాన్ని సహించనివారు, ఈ బహిష్కరణను నిరసించిన వారు కూడా ఆ సమాజంలో లేకపోలేదు. వారిలో 'ముతి'మ్ బిన్ అదీ' గొప్ప నాయకుడు. అతను తనతో పాటు ఏకీభవించేవారిని కొందరిని పిలుచుకుని కాబా ప్రాంగణంలోకి వచ్చి బహిష్కరణను అంతమొందించడానికి ప్రయత్నం చేశాడు. అక్కడ బహిష్కరణపై చర్చ జరిపించి, కురైషీలు బహిష్కరణ పట్ల కాబాలో వ్రేలాడదీసిన ప్రకటనను, అందరి సమక్షంలోనే చించివేసేలా సన్నివేశాన్ని సృష్టించాడు. ఆ కాలంలోనే ప్రవక్తశ్రీకి బాసటగా నిలిచిన ఆయన బాబాయి అబూ తాలిబ్, తనకు ఇంతకాలం ఊరట కలిగిస్తూ వచ్చిన ఆయన(స) సతీమణి ఖదీజా పరమపదించడం వల్ల పూర్తిగా నిరాశ్రయులుగా మారిపోయారు ప్రవక్త మహనీయులు.

మరో ఉదంతం తాయిఫ్ నగరానికి సంబంధించింది. బహిష్కరణ ముగిసిన కొన్నాళ్ళకే బాబాయి అబూ తాలిబ్, సతీమణి ఖదీజా దివంగతులయిన తరువాత మక్కా నగరంలో తనకు, తన సందేశానికి వ్యతిరేకత తప్ప మరేమీ మిగల లేదన్న బెంగతో దైవ సందేశానికి మరేదయినా కేంద్రం అన్వేషణలో ఉన్న ప్రవక్తశ్రీ(స) తాయిఫ్‌లో తన సందేశానికి అనువయిన వాతావరణం ప్రాప్తమవుతుందన్న ఆశతో అక్కడికి ప్రయాణమయ్యారు కాలినడకనే. అక్కడి నాయకులు ఆయన అందజేసిన సందేశం యావత్తు విని, ఆయన పట్లను, ఆయన సందేశం పట్లను అవహేళనగా ప్రవర్తించారు. అంతేకాక ఆ నగరంలోని రౌడీమూకను పురికొలిపి దైవప్రవక్తను, ఆయనకు తోడుగా వచ్చిన ఆయన సహచరుడు జైద్‌ని తీవ్రమయిన హింసకు గురిచేశారు. రక్తసిక్తమయిన శరీరంతో బాధపడుతున్న ప్రవక్తను నగరం నుండి తరిమివేశారు.

మక్కా నగరానికి తిరిగి రావడం తప్ప గత్యంతరం లేకపోయింది. మక్కాలో పునః ప్రవేశానికి ప్రవక్తశ్రీ తనకు తన తెగ ఆశ్రయమే లేకపోవడం చేత మరే నాయకుడయినా ఆశ్రయం కల్పిస్తారేమో అన్న ఆశతో కొందరు మక్కా నాయకుల వద్దకు రాయబారం నెరపి చూశారు ఆయన. కాని అందరూ తమ వల్ల కాదని తమ నిస్సహాయతను వ్యక్తపరిచారు. ఆ సందర్భంలో కూడా 'ముతి'మ్ బిన్ అదీ ఆశ్రయాన్ని అందజేసేందుకు అంగీకరించడమేకాక ఆ రాత్రికి తన ఇంటనే బస చేయవలసిందని కూడా కోరాడు. మరుసటి రోజు తన తనయుల్నీ సోదర తనయుల్నీ ఆయుధాలు ధరింపజేసి ప్రవక్తశ్రీకి అండగా నిలిచాడు, నగర ప్రవేశం కల్పించాడు. అబూ జహ్లా అడిగిన ప్రశ్నకు, తాను ఇస్లామ్ స్వీకరించలేదు కాని ఆయన(స)కు ఆశ్రయం కల్పిస్తున్నానని సమాధానం ఇచ్చాడు. ఆ రోజుల్లోనే ఆయన ప్రియ సహచరుడు అబూ బక్ర్(రజి) పెట్టే బేడా సర్దుకుని మక్కా నగరం విడిచి పోతున్నప్పుడు ఇబ్నుద్దగినా అనే ఒక ముస్లిమేతర నాయకుడు ఆయన్ని వెనక్కి రప్పించి, మీలాంటి సంఘ సేవకుల అవసరం మక్కా ప్రజలకు ఉందని వక్కాణించాడు.

ఇది ఆనాటి చరిత్ర, ఇది ప్రవక్త మహనీయుని వైఖరి. ఇది అబూ తాలిబ్, ముతి'మ్ బిన్ అదీ వంటి సుహృదయులు, శుభాత్ములు ఆయన(స) సందేశాన్ని స్వీకరించకపోయినా ఆయన పట్ల కనబరచిన సానుభూతి గాథ.

ఈ రెండు సందర్భాలలోనూ ప్రవక్త మహనీయుల వైఖరి గమనార్హమయినది. తనను, తన అనుయాయుల్ని పదమూడు ఏళ్ళు నిర్దయగా హింసించి ప్రాణ విదారకమయిన కష్టాలకు గురిచేసిన వారిని ప్రవక్త మహనీయులు, కారుణ్యమూర్తి, ముహమ్మద్(స), మక్కా విజయానంతరం తనకు అవకాశం లభించినా తన ప్రాణ శత్రువులు తనకు హస్తగతమయి తన దయా దాక్షిణ్యాలపైనే ఆధారపడి ఉన్నా ఆయన ఉదారంగా "వెళ్ళండి, మీ అందరికీ

స్వేచ్ఛ లభించింది, నేడు మీపైన ఎటువంటి ప్రతిబంధకం, విచారణ లేవు" అని అభయ వాక్కు పలికారు. అలాగే తాయిఫ్‌లో తనకు ఆటపట్టించి, నిర్దయగా గాయపరిచి వదలిన వారిపైనా ఎటువంటి కక్ష చూపక, "వీరు కాకపోతే వీరి సంతతిలో ఎవర యినా ఇస్లామ్ అనుయాయులుగా రూపాంతరం చెందవచ్చు" అన్న ఆశాభావం చూపి వదిలిన మహనీయుడాయన. ముస్లిములు ఆ కారుణ్యమూర్తి అనుయాయులు!

ముస్లిములు దాదాపు 14 వందల ఏళ్లకు పూర్వమే భారతావనిలో దైవ సందేశ ధ్వజవాహకులుగా ప్రవేశించారు. అయితే కాలక్రమేణ తమ విధ్యుక్త ధర్మాన్ని విస్మరించి కేవలం తమ వ్యక్తిగత మేలును, లేదా మహా అయితే తమ సాముదాయిక శ్రేయాన్ని కోరుకునే వారుగా మాత్రమే రూపాంతరం చెందారు. నిజానికి వారిని గురించి వారి ప్రభువు దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా నిర్దేశించాడు :

**ఇకపై ప్రపంచంలో ఉత్తమమయిన సముదాయం మీరే, మిమ్మల్ని మానవుల మార్గదర్శకత్వానికి, సంస్కరణకు రంగంలోకి తీసుకు రావడం జరిగింది. మీరు సత్కార్యాలను ఆదేశిస్తారు, చెడు నుండి వారిస్తారు, ఇంకా దైవాన్ని విశ్వసిస్తారు. (ఆలె ఇమ్రాన్: 110)**

ఇంకా :

**ఈ విధంగానే మేము మిమ్మల్ని ఓ మధ్యస్థ సముదాయంగా ఏర్పరిచాము, తద్వారా మీరు ప్రపంచ జనావళికి సాక్ష్యంగా నిలవాలని, ప్రవక్త మీకు సాక్షిగా నిలువాలనీను.**

**(అల్ బకర : 143)**

ఇంకా :

**మీలో కొందరు, సత్కార్యాల వైపునకు పిలిచేవారు, మంచిని ఆదేశించేవారు, చెడుల నుండి వారించేవారు తప్పనిసరిగా ఉండాలి. ఈ విధిని నిర్వర్తించిన వారే సాఫల్యాన్ని పొందేవారు.**

**(ఆలె ఇమ్రాన్: 104)**

ఇంతేకాక ఏ ప్రవక్త అనుయాయులుగా ముస్లిములు తమ్ము తాము ప్రకటించుకుంటారో ఆయన తన చివరి సందేశంలో తెలిపిన ఆదేశాన్ని పాలించడమూ అవసరమే. **"నా ద్వారా విన్న ఒక్క వచనాన్నయినా తప్పనిసరిగా జనానికి చేరవేయండి"** అని ఆయన(స) నుడివిన ఆ మాటను నిలబెట్టుకోవడమూ అవసరమే! పైన పేర్కొన్న దివ్య ఖుర్‌ఆన్ వచనాల ద్వారా ముస్లిమ్ సముదాయం పైన దైవం నెలకొలిపిన బాధ్యత ఏమిటో అతి స్పష్టంగా ద్యోతకమవుతుంది. వారిని మానవాళి సన్మార్గ దర్శకత్వానికి, సంస్కరణకు మానవుల సమక్షంలో సత్యానికి సాక్షులుగా నిలబెట్టడం జరిగిందని, వారిని జనులను మంచి వైపునకు పిలిచే వారుగా, చెడునుండి వారించేవారుగా నియమించడం జరిగిందని కూడా స్పష్టమవుతోంది.

కాని మన దేశంలో ముస్లిముల చరిత్ర ఏమిటి? భారతీయ సమాజం సైద్ధాంతికంగా బహుళ జాతీయ సమాజం. ఇక్కడ ఒకే దేవుని ఆరాధకులు, బహుదైవారాధకులు, దైవాన్ని నమ్మనివారు, బౌద్ధులు, జైనులు, క్రైస్తవులు, ఆదిమవాసులు, హరిజనులు, గిరిజనులు ఇంకా నిరుపేదలు, అగత్యపరులు, ఉపేక్షితులు- వీరంతా మెండుగా ఉన్నారు. వీరందరితోపాటే ముస్లిములు సహజీవనం సాగిస్తున్నారు. ఇందులో సందేహం లేదు. అయితే వీరందరి మధ్య ముస్లిములు తమ జీవిత ధ్యేయాన్ని నిర్వర్తిస్తు న్నారా? తమకు దైవం, దైవప్రవక్త అప్పజెప్పిన బాధ్యతను నిర్వర్తిస్తున్నారా? ముస్లిములు తమ ప్రవక్తకు అనురూపంగా ప్రేమ స్వరూపులయి తమ వైఖరి వల్లనూ, ఆచరణ ద్వారానూ, కారుణ్య మూర్తి అనుయాయులుగా నిరూపించుకున్నారా? తమకు బాసటగా ఇక్కడి సమాజంలోనూ ఏ మాత్రం కొరవడని అబూ తాలిబ్‌లను, ముతిమ్ బిన్ అదీలను ఇబ్నుద్దగినాలను ఆశ్రయించి తమకు బాసటగా సృజించుకున్నారా?

ఈ ప్రశ్నలన్నింటికీ సకారాత్మక కృషి ద్వారా సరయిన సమాధానాలు వెదకవలసిన అవసరం ఎంతయినా ఉంది. దేశంలో ఎల్లెడలా ద్వేషం, విద్వేషం, పరస్పర వైముఖ్యం నిండిన వాతావరణంలో సుహృద్భావ పూర్వకమయిన వాతావరణాన్ని సృజించడంలో తమ పాత్ర పోషించవలసిన అవసరం ఎంతో ఉంది.

దేశ సాధారణ జనావళి మధ్య మానవతను పెంచే ప్రతి వ్యక్తిలో సౌజన్యాన్ని పాదుకొలిపే, సత్యత పట్ల మక్కువను జనింపజేసే బాధ్యత ముస్లిములదే. వినయాన్ని, వినమ్రతను నింపే, సమాజంలో న్యాయాన్ని అందజేసేవారుగా కృషి చెయ్యవలసిన అవసరముంది. స్వయంగా ముస్లిములు సమాజంలో మంచిని పెంచేవారుగా, చెడును తుడిచిపెట్టేవారుగా రూపొందవలసి ఉంది. ఒక్కమాట మాత్రం ముస్లిములు ఎన్నడూ మరువరాదు. ఇక్కడి ప్రజల తోటే తమ భవితవ్యమూ ముడివడి ఉంది. వీరందరికీ తమకు ఉన్నదేదో ముస్లిములు ఉదారంగా పంచి పెట్టవలసిన అవసరమూ ఎంతో ఉంది.

ముస్లిములు, సమాజం నుండి ఏదైనా కాంక్షించేవారుగా కాక సమాజానికి సేవకులుగా, ఇచ్చేవారుగా మారవలసి ఉంది. ఇక్కడి వైవిధ్యంలోనే సమైక్యతను సాధించవలసిన బాధ్యత ముస్లిములపైనే ఉంది. ఎందుకంటే వారిని దైవం ఉత్తమ సమాజంగా రూపొందించాడు. అన్యాయాన్ని, అక్రమాన్ని, హింసను, దౌర్జన్యాన్ని ఎదుర్కొనేవారుగా, చెడుల్ని అంత మొందించే వారుగా నియమిం చాడు.

ముస్లిములు గుర్తించవలసిన మహత్తర యథార్థం ఏమిటంటే వారు ఏదో యాదృచ్ఛికంగా ఈ గడ్డపై నివసించడం లేదు. వారు ఇక్కడ పుట్టి పెరుగుతున్నారంటే ఇక్కడే జీవించడానికి బద్ధులయి ఉన్నారంటే ఇదంతా కేవలం సృష్టికర్త, దైవం విశ్వప్రభువు పథకం ప్రకారమే జరుగుతోందని తెలుసుకోవాలి. వారిని దైవమే ఈ దేశ శ్రేయోభిలాషులుగా, సర్వవిధాలా భారత ప్రజల మేలును ఆకాంక్షించే వారుగా రూపొందించాడని కూడా గుర్తించాలి. అదొక్కటే ఈ దేశంలో వారి ఉనికికి సార్థకమయిన రూపం, స్థానం! ❖

**ప్రశంస, పొగడ్త** అంటే ఎవరికి ఇష్టముండదు? తమని ఎవరైనా ప్రశంసించాలని, తమ గురించి గొప్పగా చెప్పాలని ప్రతి ఒక్కరు చిన్నపిల్లల దగ్గరి నుండి, పెద్దవారి వరకూ, ఏ రంగంలో పనిచేసేవారైనా, చివరకు ఇంట్లో ఉండే గృహిణిల వరకు తను చేసిన పనికి ప్రశంస పొందాలని కోరుకుంటారు. అయితే ఎవరికి వారు ఇతరులు తమ గురించి గొప్పగా చెప్పుకోవాలని కోరుకుంటారే తప్ప ఇతరులను ప్రశంసించడం, పొగడడం ప్రతి ఒక్కరి వల్ల సాధ్యపడదు. ఎదుటివారి అభివృద్ధిగాని, వారిలోని ప్రత్యేకతలు గానీ, వారు సాధించిన విజయాల గురించి కానీ ఎంతో గొప్ప మనసు, వ్యక్తిత్వం గలవారు, కల్మషం లేనివారు మాత్రమే ఇతరులను ప్రశంసించగలరు. ఇతరులలోని మంచితనం కంటే చెడును నెగిటివ్ పాయింట్స్‌నే ప్రతి ఒక్కరూ గమనిస్తారు. ఒకవేళ ప్రశంసించినా ఎవరిని? మనకు ఇష్టమయిన వారిని, మన గురించి మంచి అభిప్రాయం గలవారిని అన్నింటికి మించి వారిని పొగిడితే మన పని జరుగుతుంది అనే ధోరణిలో ప్రశంస, పొగడ్తలు చేస్తున్నారు తప్ప నిజంగా టాలెంట్‌ను ప్రశంసించేవారు బహు తక్కువే.

అయితే ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే ఇతరులను ప్రశంసించినప్పుడు ఎదుటివారి కంటే ప్రశంసించిన వ్యక్తి గొప్పతనం, ఉదార స్వభావం ఈ ప్రపంచం గుర్తిస్తుంది. దైవమూ ఇష్టపడతాడు. ఇతరులలోని లోపాలు ఎత్తి చూపడం, తప్పు పాపంగా పరిగణించినప్పుడు, ఇతరులలోని మంచిని గుర్తించి వారికి మాటల ద్వారా గానీ, చేతల ద్వారా గానీ సహాయం చేయడం పుణ్యకార్యంగా పరిగణించబడుతుంది. ఒక మహిళ భర్త, పిల్లలు, ఇంట్లో వారి కోసం రాత్రనక, పగలనక శ్రమిస్తుంది. ఆమె తన దినచర్య అనుకుని చేస్తుంది. ఇంట్లో వారు అలాగే భావిస్తారు. కుటుంబసభ్యులు ఆమెకు ధన్యవాదాలు తెలపరు, కనీసం నీవు చేసింది బాగుంది అని చెప్పరు. ఎవరైనా, ఎప్పుడైనా ఇది బాగుంది, చాలా బాగా చేశావు, నువ్వు చాలా బాగా చేస్తున్నావు.. అంటే ఆ మహిళ ఎంతో సంతోషంగా ఫీలవుతుంది. తనలో పాజిటివ్ ఎనర్జీ, కాన్ఫిడెన్స్ (ఆత్మ విశ్వాసం) పెరుగుతుంది. ఇంకా చేయాలి తన కుటుంబం కోసం అనే ఉత్సాహం కలుగుతుంది. ఒక ఉద్యోగి యజమాని పని చేస్తున్నాడు, జీతం ఇస్తున్నాం కదా అనుకుంటారు. కానీ బాగా పని చేసినప్పుడు అద్భుతంగా చేశావు అని ప్రశంసిస్తే అతనిలో తప్పకుండా ఆత్మ విశ్వాసం పెంపొందించే దిశలో వారు అడుగులు వేస్తారు. ఏ రకంగా చూసినా పాజిటివ్ యాటిట్యూడ్ పెరుగుతుంది. ఆ రోజంతా కూడా అతను సంతోషంగా ఉండగలుగుతాడు. "మన వల్ల ఇంకొకరికి సంతోషం కలిగినా, మన వల్ల ఇంకొకరు చిరునవ్వు నవ్వినా అది కూడా సత్కార్యమే




- పర్వీన్ సుల్తానా, విజయవాడ

అని అల్లాహ్ తెలియజేస్తున్నాడు". మన జీవితం ఎన్నో మానవ సంబంధాలతో ముడిపడి వుంది. మన కుటుంబసభ్యులు కావచ్చు, మన సన్నిహితులు, స్నేహితులు కావచ్చు, ఇరుగు పొరుగు వారు కావచ్చు, మనం ఉద్యోగం, వ్యాపారం చేసే సంస్థలలో కావచ్చు, వారిని వారి ప్రత్యేకతను గుర్తించి ప్రశంసించాలి. అది ఎన్నో రకాలుగా మనిషికి ఆహ్లాదాన్ని ఇస్తుంది. ఇంకా మెరుగ్గా పని చేయడానికి దోహదపడుతుంది.

అయితే ఈ ప్రశంసను చాలా జాగ్రత్తగా ఉపయోగించాలి. ఒక వ్యక్తి వికాసానికి గాని, ఆధ్యాత్మిక పురోగతికి గానీ, పురోగమనంకు దారి తీయొచ్చు. తిరోగమనంకు దారి తీయొచ్చు. ఆరోహణకు దారి తీయొచ్చు, అవరోహణకు దారి తీయొచ్చు. ప్రశంస అంటే చేసిన పనిని బాగుంది అని మెచ్చుకోవడం, భుజం తట్టడం, చప్పట్లు కొట్టడం, వ్యక్తీకరించడం. అయితే ప్రశంస కాస్తా పొగడ్త అయిందనుకోండి అసలుకే చేటు. ప్రశంసకు, పొగడ్తకు తేడా ఏమిటంటే ప్రశంస శృతిమించితే, అవసరమైన దానికంటే ఎక్కువగా ప్రశంసిస్తే అది పొగడ్త అవుతుంది. అవసరానికి మించిన ప్రశంస తిరోగమనంకు దారి తీస్తుంది.

ఆధ్యాత్మిక మార్గంలోనయితే ఈ పొగడ్తల గురించి చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రవక్త(స) వారు తెలియజేశారు :

"అల్లాహ్ అనుగ్రహం పొందాలని తప్పించి, ఇతరుల మెప్పు, పొగడ్తల కోసం, గొప్పతనం కోసం చేసే ఏ పుణ్యకార్యమైనా, అది నమాజ్ అయినా, జిహాద్ అయినా, దానధర్మాలయినా స్వీకరింపబడవు. వీటికి అవమానకరమైన శిక్ష లభిస్తుందని తెలిపారు. బిగినర్స్‌కు ప్రశంస చాలా అవసరం. అతనికి సహాయం చేయడం అవసరం. అయితే ఒక వ్యక్తి ఎప్పుడైతే ప్రశంసకి బానిసవుతాడో అప్పుడు ప్రమాదం. ఉదాహరణకు ఈ రోజు నేను చేసిన పనికి ప్రశంసించారు. మరుసటి రోజు రాలేదు. ఒకలాంటి అభద్రతా భావం, రాలేదన్న ఫీలింగ్, రాదేమో అనే

ఆలోచన ఇలాంటివి సంక్లిష్టత వైపు వెళ్ళే అవకాశం ఉంది. అందుకే ఎటువంటి పరిస్థితులలోనైనా ప్రశంసలకు, పొగడ్తలకు లోను కాకూడదు. ఒక వ్యక్తిని ఒక స్థాయికి ఎదగకుండా అవరోధం అవుతుంది. అనవసర, అబద్ధమైన పొగడ్త ద్వారా వారు బానిసయి, ఎదుటివారు చెప్పిన ప్రతి మాట నిజమే అనుకునే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రశ్నించే, ఆలోచించే తత్వం మనిషిని ఉన్నతికి చేరుస్తుంది. ఇలాంటి వారు ప్రశ్నించకుండా, విభేదించ కుండా, పరిశీలన చేయకుండా, ప్రతిదీ గుడ్డిగా అనుసరిస్తారు. ఆధ్యాత్మిక రంగంలోనయితే పెద్దపెద్ద పండితులు సయితం దీనికి అతీతులు కారు. నిజమైన దైవభక్తి గల వారికి ఎలాంటి పొగడ్త అవసరముండదు. అటువంటి స్థితికి అతను చేరితే, ఆధ్యాత్మికతలో అది అతని తిరోగమనమే. పొగడ్తలకు ఉత్తేజితం అయిన వ్యక్తి అదే స్థాయిలో అవమానం జరిగితే కృంగిపోతాడు. ఒక వ్యక్తి పొగడ్తకి బానిస అవకుండా ఏ మాత్రం ఉత్తేజితం అవకుండా స్థితప్రజ్ఞంగా ఉండాలి. అప్పుడే ఎలాంటి పరిస్థితు లలోనయినా ధైర్యంగా, మనోధైర్యంతో ముందుకు సాగగలడు.

ప్రశంస అనేది చాలా ముఖ్యం అయితే అవసరానికి మించిన, అబద్ధపు పొగడ్తల నుంచి ప్రతి వ్యక్తి తనను తాను కాపాడుకోవటం కూడా అంతే ముఖ్యం. అల్లాహ్ మనందరికీ ఇలాంటి పరిస్థితుల నుండి రక్షించాలి. ఆమీన్...

# ఈ పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో పెళ్లి చేయొచ్చు



**పెళ్లి ఖర్చులు** విపరీతంగా పెరిగిపోతున్నాయి... మనదేశంలో చదువు కంటే కూడా పెళ్లి కోసమే ఎక్కువ ఖర్చుపెడుతున్నారు. 2022– 2023 ఏడాదిలో దేశంలో జరిగిన వివాహాలకు 4.72 ట్రిలియన్ డాలర్ల ఖర్చు అయినట్లు ఓ అంచనా. అది కాస్త 2023–2024 ఏడాదికి వచ్చేసరికి 5.52 ట్రిలియన్లకు పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి ముస్లిమ్ సామాజిక వర్గంలో అయితే పెళ్లి తంతు ఎన్నో అనర్థాలకు కారణమవుతోంది. వివాహాలకు వధువు కుటుంబంపైనే ఎక్కువ భారం పడుతోంది. దీంతో ఆడబిడ్డల పేరెంట్స్ ఆర్థికంగా చితికి పోతున్నారు. పెళ్లి శుభలేఖ దగ్గర నుంచి మండపాలంకరణ వరకు, పెళ్లిబట్టల నుంచి నగల వరకు, టిఫిన్ల దగ్గర నుంచి విందు భోజనాల వరకు అన్నింటా ప్రత్యేకంగా ఉండాలనే స్టేటస్‌కు పోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో అర్ధరాత్రి దాటిన తరువాత బారాత్‌ల హంగామా పోలీసులకూ తలనొప్పిగా మారింది. అమ్మాయి పెళ్లితో ఎంతోమంది తల్లిదండ్రులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. వరుడి తల్లిదండ్రులు పెట్టే డిమాండ్స్ తీర్చేందుకు అమ్మాయి పేరెంట్స్ లక్షల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. హైదరాబాద్ సిటీలో ముస్లిమ్ వివాహ వేడుకల్లో సంస్కరణలు చేపట్టేందుకు ఉలమాలు ముందడుగు వేశారు. ప్రవక్త సాంప్రదాయిక పద్ధతిలో వివాహాలను జరిపిస్తే ఖర్చు తగ్గించు కోవచ్చని ఉలమాలు చెబుతున్నారు. 'మస్నూన్ నికాహ్ తహ్రీక్' పేరుతో ఉద్యమాన్ని చేపట్టారు. ఈ మేరకు పాతబస్తీ చార్మినార్ సమీపంలోని గుల్జార్ ఫంక్షన్ హాల్లో ఉలమాలు సమావేశమయ్యారు. పెళ్లి, వలీమా వేడుకల పేరుతో జరుగుతున్న వృథా ఖర్చుకు అడ్డుకట్ట వేసేందుకు ఉలమాలు పలు తీర్మానాలు చేశారు. 'అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన వివాహమే శుభవంతమైనది' అన్న ముహమ్మద్ ప్రవక్త ప్రవచమే ప్రేరణగా ముస్లిములు తమ పిల్లల పెళ్లిళ్లు జరిపించాలని జమాఅతె ఇస్లామీహింద్ తెలంగాణ ఉపాధ్యక్షులు హాఫిజ్ రషాదుద్దీన్ అన్నారు. పెళ్లిని సులభతరం చేసి, వివాహ వేడుకల్లో అనవసరమైన, మంగ్నీ, మెహందీ, హల్దీ, బారాత్ లాంటి దురాచారాలను అరికట్టాలని సమావేశం తీర్మానించింది. వివాహాన్ని మస్జిదులో చేసి అమ్మాయి తల్లిదండ్రులకు విందు ఖర్చు లేకుండా చేయాలని తీర్మానించారు. పెళ్లిలో విందు లేకుండా జరిగే పెళ్లిళ్లను ప్రోత్సహించాలని, అబ్బాయి తరపు వారు ఇచ్చే వలీమా విందును నిరాడంబరంగా జరిపించాలని ఉలమాలు పిలుపునిచ్చారు. పెళ్లి వేడుకల్లో బ్యాండు బాజాలు, బాణాసంచా కాల్పులు, వీడియోగ్రఫీ, ఖరీదైన వేదికలు లేకుండా తక్కువ ఖర్చుతో పెళ్లిళ్లు జరిపించాలని ఉలమాలు తీర్మానించారు. ఈ సమావేశంలో ముస్లిమ్ పర్సనల్ లా బోర్డు అధ్యక్షులు మౌలానా ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ, మౌలానా జాఫర్ పాషా సానీ, ఎంపీజే స్టేట్ ప్రెసిడెంట్ అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ ఉస్మాన్ ఈ ఉద్యమానికి కన్వీనర్‌గా వ్యవహరించారు.



# ఒక విశ్వాసి మనస్తత్వం

నసీరా బేగం

**హజ్రత్ ఆయెషా(ర) ఇలా సెలవిచ్చారు :** "ఎవరు, తాము ఇవ్వగలిగినది ఇస్తుంటారో, కాని వారి హృదయాలు తమ ప్రభువు వైపునకు మరలిపోవలసి ఉన్నది అనే భావన వల్ల వణుకుతూ ఉంటాయో" (23: 60) అనే దివ్య ఖుర్ఆన్‌లోని ఈ వాక్యాన్ని గురించి దైవప్రవక్త(స) గారితో ఓ దైవప్రవక్తా(స)! ఏమిటి వీరు మద్యాన్ని సేవించేవారా? లేదా దొంగతనం చేసేవారా? ఎవరు దీని సంబోధితులు? అని అడిగాను. దానికి దైవప్రవక్త(స) ఓ సిద్దీఖ్ కుమార్తెలారా! వీరు ఎవరంటే, నమాజులు చేసేవారు, ఉపవాసాలు పాటించేవారు, అల్లాహ్ మార్గంలో ఖర్చుచేసేవారు అయినప్పటికీ వారు తమ సత్కార్యాలు స్వీకరింపబడతాయో లేదో అని లేదా వృథా అయిపోతాయేమో అని భయపడుతూ ఉండేవారు అన్నమాట. ఇలాంటి వారే సత్కార్యాల వైపునకు అతివేగంగా పరుగులు తీసేవారు. (తిర్మిజీ, ఇబ్నెమాజా)

ఈ సూక్తి ద్వారా హజ్రత్ ఆయిషా(ర)గారు ఖుర్ఆన్, హదీసు విషయాలను ఎంత క్షుణ్ణంగా అవగాహన చేసుకునేవారో స్పష్టంగా తెలుస్తోంది. ఏదైనా విషయం పూర్తిగా అర్థం కాకపోతే మరీ దైవప్రవక్త(స) గారితో వివరణ కోరి అవగాహన చేసుకునేవారని కూడా స్పష్టమవుతోంది. కనుకనే ఆమె(ర) గారు చరిత్రలో గొప్ప విద్వాంసురాలుగా ఖ్యాతిగాంచారు. దీనిద్వారా తెలిసే మరొక విషయమేమిటంటే ఖుర్ఆన్, హదీసు గ్రంథాలను స్వయంగా అర్థం చేసుకుని, ఆచరించవలసిన అవసరం ప్రతి వ్యక్తిపై ఎంతైనా ఉంది. ఎవరైనా ఒకవేళ అరకొర జ్ఞానంతో ఇట్టే జీవితాన్ని గడిపివేసినట్లయితే దాని పర్యవసానాన్ని వారు పరలోకంలో అనుభవించవలసి ఉంటుంది. దానిప్రభావం వారి ఇహలోక జీవితంపై కూడా పడుతుంది.

అయితే ఈ సూక్తిలో ఒక విశ్వాసి భయభక్తుల గురించి వివరణ ఉంది. సాధారణంగా ఒక మనిషి దుష్కార్యాలు చేసిన ప్పుడు భయాందోళనకు గురిఅవుతాడు. ఎక్కడ పట్టుబడతానో అని, ఎక్కడ శిక్ష అనుభవించవలసి ఉంటుందో అనే విషయాన్ని గురించి ఆందోళన చెందుతాడు. కాని ఒక విశ్వాసి భయం దానికి భిన్నంగా ఉంటుంది.

ఒక విశ్వాసి సత్కార్యాలు చేస్తూ ఉన్నా తాను గొప్ప భయభక్తులు కలవాడిననో లేదా నేను తన భక్తి కారణంగా దైవ సామీప్యాన్ని పొందినవాడిననో లేదా నేను తప్పకుండా దైవ సంతోషాన్ని పొందుతాననో ఇంకా ఏ విధంగానైనా నాకు స్వర్గం లభించి తీరుతుందనే ధీమాను కలిగి ఉండటమో లేదా గర్వాన్ని వ్యక్తం చెయ్యటమో ఎంత మాత్రమూ చెయ్యడు, అతను ఎన్నో సత్కార్యాలు చేస్తూ ఉన్నప్పటికీ నేను ఒక దినం తప్పకుండా దైవ సమక్షంలో హాజరు అవ్వవలసి ఉందనీ, అప్పుడు అక్కడ అతను ఇహలోకంలో చేసిన సత్కార్యాలు దైవామోదానికి

నోచుకుంటాయో లేదో అని భయపడుతూ వణుకుతూ ఉంటాడు. అతను ఎల్లప్పుడూ తన తప్పులపై, తన బలహీనతలపై దృష్టి ఉంచుతాడు.

అల్లాహ్ గౌరవప్రతిష్టలను గురించి, ఆయన శక్తియుక్తులను గురించి, ఆయన గాంభీర్యాన్ని గురించి ఆలోచించి, ఆయన అధీనంలోనే తన గురించి నిర్ణయం జరుగుతుందనే విషయాన్ని గురించి వణుకుతూ ఉంటాడు. తన సత్కార్యాలను చిత్తశుద్ధితో జరిగేలా జాగ్రత్తపడతాడు. అలాగని అల్లాహ్ విశాల దృష్టిని, అనంతమైన కారుణ్యాలను, క్షమాభిక్ష పెట్టే అనంతమైన సుగుణాన్ని గురించి తెలియక ఎంత మాత్రమూ కాదు. దానిపట్ల విశ్వాసం లేదని అంతకంటే కాదు.

ఒక విశ్వాసి హృదయంలో కలిగే ఈ భావాలు అంటే భయం, ఆశ అనేవి అతన్ని ఎల్లప్పుడూ చురుకుగాను, బాధ్యతాయుతం గాను తీర్చిదిద్దుతాయి. సరిహద్దులపై రక్షణా బాధ్యతలను నిర్వహిస్తున్న ఒక సైనికుని మాదిరిగా అతను అత్యంత జాగ్రత్తగా మసలుకుంటూ ఉంటాడు. తన కోసం తన ద్వారా ఎలాంటి తప్పులు జరగకూడదని జాగ్రత్తపడతాడు. ఒకవేళ జరిగినా అశ్రద్ధ చెయ్యకుండా వెంటనే అల్లాహ్‌ను వేడుకుంటాడు. క్షమాభిక్షను వేడుకుంటాడు. అంతా చేసి కూడా భయపడతాడు. ఇటువంటి విశ్వాసినే అల్లాహ్ అమితంగా ఇష్టపడతాడు. అతని స్థానాలను ఉన్నతమైనవిగా చేస్తాడు.

దైవప్రవక్త(స) గారి మరొక సూక్తిలో ఒక విశ్వాసి, ఒక కపటి హృదయ స్థితిని, మానసిక స్థితిని గురించి ఇలా వివరించటం జరిగింది. ఒక పెద్ద బండరాయి క్రింద కూర్చొని ఉన్నాడు. అది అతనిపై వంగి ఉంది. అది వచ్చి ఎప్పుడు తనపై పడిపోతుందో అని వణుకుతూ ఉంటాడు. అతను దాని గురించి ఎప్పుడు అశ్రద్ధకు, నిర్లక్ష్యానికి గురికాడు. ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటాడు. దానికి వ్యతిరేకంగా ఒక కపటి తన ద్వారా ఏదైనా దుష్కార్యం జరిగినప్పుడు తన ముక్కుపై ఒక ఈగ వాలి వెళ్ళి పోయింది. మళ్ళీ వచ్చి కూర్చుంది అంతే అన్నట్టు అతి తేలికగా భావిస్తాడు. అతను పెద్ద పెద్ద పాపకార్యాలు చేసి కూడా ఏమీ చెయ్యనట్లుగా అశ్రద్ధగా, నిర్లక్ష్యంగా జీవితం గడుపుతూ ఉంటాడు. హజ్రత్ హసన్ బస్రీ(ర) ఈ సూక్తిపై వివరణ ఇస్తూ ఇలా అన్నారు : ఒక విశ్వాసి అల్లాహ్ పట్ల విధేయత చూపుతూ దైవారాధన చేస్తూ కూడా భయపడుతూ ఉంటాడు. ఒక కపటి అల్లాహ్ పట్ల అవిధేయత చూపుతూ కూడా పాపకార్యాలు చేస్తూ కూడా ఎలాంటి భయానికి గురికాడు. చివరిగా ఆయన(స) బోధించిన ఈ వాక్యాల్లో వారే మేళ్ళ వైపునకు పరుగులు తీస్తారు. పోటీపడి వాటిని పొందుతారు. (23: 61)

ఒక విశ్వాసి సత్కార్యాలు చెయ్యటంలో పరుగులు తీస్తాడు. అంటే దాని అర్థం అతని దృష్టి ఎల్లప్పుడూ ఏదో ఒక మంచి కార్యం చేసి పుణ్యం సంపాదించుకోవాలనే ఆతృత కలిగి ఉంటాడు. అవకాశం దొరికిన వెంటనే అందుకుంటాడు. ఆ అవకాశాన్ని ఇతరులు అందుకుంటారేమో వారికంటే ముందు తాను చేజిక్కించుకోవాలనే ఆశను కలిగిఉంటాడు. అతనిలో ఉండే ఈ సుగుణం అతన్ని ఎల్లప్పుడూ చురుకుగా ఉంచుతుంది. అది లక్ష్యాన్ని పొందే విషయంలో అతనికి తోడ్పడుతూ ఉంటుంది. అతని ప్రతి ఉదయం అతనిలో నూతన ఉత్తేజాన్ని రేకెత్తిస్తుంది. అతని ప్రతి సాయంత్రం అతన్ని దైవ విధేయతలో, దైవారాధనలో నిమగ్నమయ్యే విధంగా తీర్చిదిద్దుతుంది. ఈ విధంగా అతని రాత్రీ పగలు అతనికి ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి. దైవ సామీప్యాన్ని చేరువగా చేస్తాయి. అతనికి స్వర్గ సోపానాలు లభించేలా తోడ్పడతాయి.

దీనిద్వారా తెలిసిన విషయమేమిటంటే, ఒక మనిషి ఇహపర లోకాలు సఫలీకృతమవ్వాలంటే ఈ ఖుర్‌ఆన్, హదీసులలో ప్రస్తావించిన ప్రకారం భయభక్తులు కలిగి ఉండి సత్కార్యాలు చెయ్యటంలో ఎల్లప్పుడూ ముందుండాలి. ఇతరులకంటే వెనుక ఉండకూడదు. సాధారణంగా జరిగే విషయమేమిటంటే, విడిచి వెళ్ళిపోయే ఇహలోక జీవిత సామగ్రుల కోసం అందరూ పోటీపడుతూ ఉంటారు. ఒకరిని మించి మరొకరు పొందే ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఇందులోనే తన విలువైన జీవిత సమయాన్ని కోల్పోతూ ఉంటారు. చివరికి తిరిగి వెళ్ళిపోయే సమయం వచ్చినప్పుడు ఖాళీ చేతులతో ఉండిపోతారు. ఎండమావులు మాదిరిగా అయిపోతుంది వారి జీవితం.

విడిచి వెళ్ళిపోయే ఇహలోకం గురించి అతిగా పోటీ పడటం అవివేకం. కలకాలం ఉండిపోయే పరలోక జీవితం కోసం అతిగా పోటీపడటం వివేకం.

చాలామంది ప్రజలు ఇహలోకం కోసం పోటీపడటం తప్పని సోమరితనానికి గురవుతారు. ఈ విధంగా భావించటం మూర్ఖత్వం. ఇహపరలోకాలు రెండింటి కోసం మనిషి కష్టపడవలసి ఉంటుంది. చెమట కార్చవలసి ఉంటుంది. కాని దేనికి ఎంత ప్రాముఖ్యత ఇవ్వాలో ఇస్లామ్ చట్టం ప్రకారం అంత ఇవ్వవలసి ఉంటుంది. ఇది వివేకం.




## బంగ్లాదేశ్ నుంచి వచ్చేవారికి ఆశ్రయం కల్పిస్తాం

బంగ్లాదేశ్ నుంచి వచ్చేవారికి ఆశ్రయం కల్పిస్తామని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో అల్లర్లు జరుగుతున్నాయి. ఆందోళనల్లో వంద మందికిపైగా మరణించారు. ఈ నేపథ్యంలో పొరుగు దేశంలో జరుగుతున్న పరిణామాలపై మమతా బెనర్జీ స్పందించారు. కోల్‌కతాలో నిర్వహించిన 'అమర వీరుల దినోత్సవం' ర్యాలీలో ఆమె మాట్లాడారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చేవారు మా తలుపు తడితే వారికి ఆశ్రయం కల్పిస్తాం అని చెప్పారు. శరణార్థులను గౌరవించాలని ఐక్యరాజ్య సమితి తీర్మానం ఉంది' అని అన్నారు. బంగ్లాదేశ్‌లో చదువుకుంటున్న భారత విద్యార్థులతోపాటు ఇతర దేశాల విద్యార్థులు కూడా ఇండియాకు వచ్చేస్తున్నారు.

## నీట్ రద్దు అవసరం లేదు

నీట్ యూజి పరీక్షను రద్దు చేయనవసరం లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ప్రశ్నా పత్రం లీకేజీలో వ్యవస్థాగతమైన ఉల్లంఘనలేవీ జరగలేదని అందువల్ల పరీక్ష పవిత్రత దెబ్బ తినలేదని వ్యాఖ్యానిం చింది. పరీక్షను రద్దు చేయాలని కోరుతున్న పిటిషన్లను తోసిపుచ్చింది. ఈ పరీక్షను తిరిగి నిర్వహించడం వల్ల దాదాపు 23లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడతారని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. పైగా భవిష్యత్తులో అర్హులైన వైద్య నిపుణులు అందుబాటులో వుండేందుకు ఆటంకం కలుగుతుందని పేర్కొంది.

## బానో కేసులో దోషుల పిటిషన్ డిస్మిస్

గుజరాత్‌కు చెందిన బిల్కిస్ బానో కేసులో ఇద్దరు దోషులు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఈ ఇద్దరి శిక్షా కాలాన్ని తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు జనవరి 8న రద్దు చేసింది. ఈ తీర్పుపై దోషులు అప్పీల్ చేశారు. సుప్రీంకోర్టు ధర్మాసనం స్పందిస్తూ, ఇదే కోర్టులోని సమాన స్థాయి గల వేరొక ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై అప్పీల్‌ను ఏ విధంగా విచారించగలమని ప్రశ్నించింది. ఈ కేసులో 11 మంది దోషులు జైలు శిక్ష అనుభవిస్తున్నారు. వీరికి గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం 2022లో శిక్షను తగ్గించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను సుప్రీంకోర్టు రద్దు చేసి, తిరిగి 11 మంది దోషులను జైలుకు పంపింది. వీరిలో ఇద్దరు ఈ అప్పీల్‌ను దాఖలు చేశారు.

## మైనారిటీ వ్యవహారాల శాఖకు నిధుల పెంపు

కేంద్ర బడ్జెట్‌లో మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖకు ఈ ఏడాది రూ. 3,183.24 కోట్ల నిధులను కేటాయించారు. 2023-24 బడ్జెట్‌లో ఈ శాఖకు రూ. 2,608.93 కోట్లు కేటాయించగా తాజాగా రూ. 574.31 కోట్లు పెంచారు. వీటిలో 1,575.72 కోట్లు మైనారిటీల విద్యాభివృద్ధికి, రూ.326.16 కోట్లు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు, రూ. 1,145.38 కోట్లు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం కేటాయించారు. మొత్తంగా రూ.2,120.72 కోట్ల నిధులను మైనారిటీల కోసం ప్రతిపాదించిన ప్రధాన పథకాల, ప్రాజెక్టుల అమలు కోసం, ప్రధాన మంత్రి జనవికాస్ కార్యక్రమం కోసం రూ. 910.90 కోట్లను కేటాయించారు. జాతీయ మైనారిటీల అభివృద్ధి, ఆర్థిక కార్పొరేషన్‌కు రూ. 800 కోట్లను కేటాయించారు.

## విద్వేష ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే

కన్వర్ యాత్ర నేపథ్యంగా ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలు జారీ చేసిన విద్వేష ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది.. కన్వర్ యాత్ర మార్గంలో ఆహార పదార్థాల దుకాణదారులు, ఉద్యోగులు తమ పేర్లు, ఇతర గుర్తింపు వివరాలు ప్రముఖంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు ఆదేశించాయి. ఈ ఆదేశాలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ధర్మాసనం కన్వర్ యాత్ర సాగే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. ఇలాంటి విద్వేష ఉత్తర్వులను అమలు చేస్తే సుమోటోగా విచారణ చేస్తామని స్పష్టం చేసింది. కన్వర్ యాత్ర సాగే స్టాళ్లు, వ్యాపారులు, కూరగాయలు అమ్మేవారు, దాబా యజమానులు, తదితరులకు తాము విక్రయించే ఆహారాన్ని ప్రదర్శించే స్వేచ్ఛ ఉందని, అయితే వాటి యాజమానులు, ఉద్యోగులను వారి పేర్లు, కులం, మతపరమైన గుర్తింపు వంటి విషయాలను ప్రదర్శించాలని పోలీసులు బలవంతం చేయకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. కన్వర్ యాత్రికులకు పరిశుభ్రత, ఆహార ప్రాధాన్యతలకు అనుగుణంగా శాకాహార ఆహారాన్ని అందించడానికి అధికారులకు అనుమతి ఉందని, అయితే చట్టం మద్దతు లేకుండా స్వేచ్ఛను అణగద్రొక్కే ఉత్తర్వుల ద్వారా మున్సిపల్ అధికారుల అధికారాన్ని పోలీసులు లాక్కోలేరని ధర్మాసనం స్పష్టం చేసింది.

సర్వత్రా

## ఇజ్రాయిల్ దురాక్రమణ చట్ట విరుద్ధం

పాలస్తీనా భూభాగాలపై దశాబ్దాలుగా చేస్తున్న ఇజ్రాయిల్ దురాక్రమణ చట్టవిరుద్ధమని అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) పేర్కొంది. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అభ్యర్థన మేరకు ఐసిజె ఈ అభిప్రాయాన్ని ప్రకటించింది. దురాక్రమణకు పాల్పడడం ద్వారా ఇజ్రాయిల్ తన హెూదాను దుర్వినియోగం చేయడమేనని 15 మంది న్యాయమూర్తుల ప్యానెల్ స్పష్టం చేసింది. తూర్పు జెరూసలేంతో సహా పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ విధానాల గురించి జనరల్ అసెంబ్లీ చట్టపరమైన స్పష్టత కోరింది. 'పాలస్తీనా భూభాగాల్లో ఇజ్రాయిల్ తన ఉనికిని కొనసాగించడం చట్ట విరుద్ధమని కోర్టు గుర్తించింది' అని ఐసిజె అధ్యక్ష న్యాయమూర్తి నవాఫ్ సలాం తెలిపారు. వీలైనంత త్వరగా ఇజ్రాయిల్ తన ఆక్రమణలకు అంతం పలకాలని తెలిపారు.

## రిజర్వేషన్ల కోటా తగ్గించండి..

బంగ్లాదేశ్‌లో వివాదానికి, తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అంశంపై ఆ దేశ సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన వాళ్ల కుటుంబాలకు రిజర్వ్ చేసిన 30 శాతం రిజర్వేషన్ కోటాను 5 శాతానికి తగ్గించాలని ఆదేశించింది. 93 శాతం ఉద్యోగాలు ప్రతిభ ఆధారంగా భర్తీ చేయాలని స్పష్టం చేసింది. మిగతా రెండు శాతం ఉద్యోగాలను మైనార్టీలు, ట్రాన్స్‌జెండర్లు, వికలాంగులకు కేటాయించాలని పేర్కొన్నది. తీర్పు నేపథ్యంలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా గత కొద్ది రోజులుగా ఆందోళనలు చేస్తున్న విద్యార్థులకు పాక్షిక విజయం దక్కినట్టు అయింది.

## ఫలస్తీనా శరణార్థులకు సహాయం అందిస్తాం

ఫలస్తీనా శరణార్థుల కోసం పనిచేస్తున్న ఐక్యరాజ్య సమితి సంస్థ (యుఎన్ఆర్‌డబ్ల్యుఎ)కు నిధులను అందించడాన్ని పునరుద్ధరించనున్నట్లు బ్రిటన్ కొత్త లేబర్ ప్రభుత్వం ప్రకటించింది. యుఎన్ఆర్‌డబ్ల్యుఎ నిధుల సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నామని బ్రిటన్ విదేశాంగ శాఖ మంత్రి డేవిడ్ లామీ పార్లమెంట్‌కు చెప్పారు. గాజాకు మానవతా సాయం అందజేయడంలో ఐక్యరాజ్య సమితి సంస్థ చాలా కీలకమైనదని చెప్పారు. కొత్త నిధుల నుండి 2.70 కోట్ల డాలర్లను అందచేస్తున్నట్లు తెలిపారు. గత కన్జర్వేటివ్ ప్రభుత్వం తీసుకువచ్చిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. గాజా ప్రజలు ఇటువంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో మానవతా సాయం అందించడం నైతిక అవసరం, బాధ్యత అని లామీ వ్యాఖ్యానించారు. బ్రిటన్ అందచేసే సాయం కిందిస్థాయిలోని ప్రజలకు అందేలా చూసేది సహాయక సంస్థలే అని అన్నారు. యుఎన్ఆర్‌డబ్ల్యుఎ ఒక్కటే ఇంత పెద్ద స్థాయిలో సహాయక చర్యలు చేపట్టగలదని, మరే సంస్థ ఇంతలా సేవలు అందించలేదని లామీ పేర్కొన్నారు. జపాన్, జర్మనీ, ఇటలీ, ఆస్ట్రేలియా, కెనడా సహా పలు దేశాలు ఐక్యరాజ్య సమితి సంస్థకు సాయాన్ని పునరుద్ధరించాయి. కానీ అతిపెద్ద మొత్తంలో సాయమందించే అమెరికా మాత్రం ఇంతవరకు పునరుద్ధరించలేదు.

## అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మారుతున్న సమీకరణాలు



అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఈ ఏడాది నవంబర్ 5న జరుగనున్నాయి. రిపబ్లిక్ పార్టీ తరపున మరోసారి డోనాల్డ్ ట్రంప్ బరిలోకి దిగుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో డెమొక్రాట్ అభ్యర్థిగా భారత సంతతికి చెందిన కమలా హారిస్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మార్గం సుగమమైంది. కమలా హారిస్ బరిలో నిలుస్తుండడంతో ఎన్నికల్లో గట్టి పోటీ ఉంటుందని భావిస్తున్నారు. తాజాగా ఓ సర్వే కీలక రిపోర్ట్ విడుదల చేసింది. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ కంటే కమలా హారిస్‌కే విజయ అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు పేర్కొంది. ఐపీఎస్ఓఎస్ నేషనల్ పోల్స్ ప్రకారం.. ట్రంప్ కంటే కమలా హారిస్ ముందంజలో నిలిచారు. ఇటీవల నిర్వహించిన జాతీయ సర్వేల్లో 56శాతం మంది ఓటర్లు కమలా హ్యారిస్ అభ్యర్థిత్వంపై ఆసక్తి చూపించారు. మానసికంగా ధృడంగా ఉండగలరని.. సవాళ్లను ఎదుర్కొగల సామర్థ్యం ఆమెకు ఉందని అమెరికన్లు భావిస్తున్నారు.

# దైవం మెచ్చిన గుణం

**- ముహమ్మద్ వహీదుద్దీన్**

### మృదుత్వం

నిశ్చయంగా అల్లాహ్ మృదు స్వభావుడు. అన్ని విషయాల్లోనూ మృదుత్వాన్నే ఇష్టపడతాడు. (బుఖారీ)

### నిరాడంబరత

నిశ్చయంగా అల్లాహ్ పటాటోపాన్ని ఇష్టపడని శ్రీమంతుణ్ణి ఇష్టపడతాడు. (బుఖారీ)

### ఉదార స్వభావం

వ్యాపార లావాదేవీల్లో అప్పు చెల్లింపులో ఉదారంగా వ్యవహరించే వాడిని అల్లాహ్ తప్పక ప్రేమిస్తాడు. (ముస్తద్రక్ హాకిమ్)

### పౌరుషం

అల్లాహ్ స్వతహాగా పౌరుషవంతుడు. పౌరుషం గల దాసుణ్ణి ఇష్టపడతాడు. (ఇబ్నెమాజా)

### ఆత్మాభిమానం

ఆలుబిడ్డలు ఉండి అవసరం ఉండి కూడా అభిమానంతో ఒకరి ముందర చెయ్యి చాచని నిరుపేద దాసుణ్ణి అల్లాహ్ ప్రేమిస్తాడు. (ముస్లిమ్)

### ప్రజా శ్రేయం

ప్రజా శ్రేయాన్ని అందరికన్నా ఎక్కువగా కోరుకునే దాసుడు అల్లాహ్ దగ్గర మిక్కిలి ఇష్టుడయి ఉంటాడు. (తిబ్రానీ)

### సత్ప్రవర్తన

నేడు నా దగ్గర అత్యంత ప్రీతిపాత్రుడు రేపు ప్రళయదినాన నా సమావేశంలో నాకు అత్యంత దగ్గరగా ఉండేవాడు. మీరందరిలో ఎక్కువగా సత్ప్రవర్తన కలిగి ఉండేవాడు. (తిర్మిజీ)

### ప్రేమ

కేవలం నా ప్రసన్నత కోరుతూ ఒకరికొకరు ప్రేమించేవారు. నా ప్రేమను తప్పక పొందుతారు. (ముఅత్తా ఇమామ్ మాలిక్)

**భయభక్తులు గలవారంటే అల్లాహ్‌కు ఎంతో ప్రేమ. (ఆలి ఇమ్రాన్: 76)**

భయభక్తుల వైఖరిని అవలంబించడమంటే ఆచరించటం. ఇలాంటి సజ్జనులు దేవుని పట్టులోకి రారు పైగా వారు దైవప్రీతికి పాత్రుల వుతారు.

### శుచీ శుభ్రత

అల్లాహ్‌కు పరిశుద్ధతను పాటించేవారు అంటేనే ఇష్టం.
(అత్ తౌబా 9: 108)

పరిశుద్ధతను బాగా పాటించే ఈ సజ్జనులు ఎవరు? వారు 'ఖుబా' వాసులని హదీసు ద్వారా రూఢీ అవుతుంది. "అల్లాహ్ మీ శుచీ శుభ్రతలను కొనియాడాడు. ఇంతకీ మీరు ఏం చేస్తారు?" అని దైవప్రవక్త(స) వాళ్ళను ఒకసారి దర్యాప్తు చేయగా, "మేము మట్టి పెడ్డలను ఉపయోగించటంతోపాటు నీరును కూడా ఉపయోగిస్తాము" అని వారు వివరించారు.

ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా వ్యాఖ్యానించారు : ఒకే ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలన్న సత్సంకల్పంతో నిర్మించిన పురాతన మస్జిదులలో నమాజ్ చేయటం అభిలషణీయం అన్న దానికి ఈ ఆయత్ నిదర్శనం. అలాగే సజ్జనులు పాల్గొనే సామూహిక నమాజుకు హాజరవటం, శుచీ శుభ్రతల విషయంలో చాలా ఖచ్చితంగా ఉండేవారితో కలిసి నమాజు చేయటం కూడా అభిలషణీయమే.

### సహనం

సహనశీలురనే అల్లాహ్ ప్రేమిస్తాడు. (ఆలి ఇమ్రాన్ :146)

అంటే యుద్ధ సందర్భాలలో ఎదురయ్యే కష్టాలకు వెరవకుండా, బాధపడకుండా, భయభ్రాంతులకు లోనుకాకుండా, శత్రువులకు ఎదురొడ్డి నిలబడే వారిని ఇక్కడ సహనశీలుడు అని అనటం జరిగింది.

### న్యాయం

న్యాయం చేసేవారికి అల్లాహ్ అమితంగా ప్రేమిస్తాడు. అటువంటి వారిని అల్లాహ్ స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు.

### ఉపకారం

ఉత్తమంగా మసలుకోండి. నిస్సందేహంగా అల్లాహ్ ఉత్తమంగా వ్యవహరించేవారిని ప్రేమిస్తాడు. (అల్ బఖర)

పాపకార్యాలు జరిగినప్పుడు అల్లాహ్‌ను క్షమాభిక్ష కోరటం ఉత్తమం. కాని పాపకార్యాలు జరగకుండా చూసుకోవటం ఇంకా ఉత్తమం.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**